మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com

Circulated to Telangana
Published from Jagitial

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 27-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 59 Issue: 59


27 ఆగస్టు 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:30 తిథి చతుర్దశి ఉ. 9:07 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ధనిష్ఠ రా. 2:04o వరకు తరువాత శతభిష యోగం శోభన ఉ. 7:52 వరకు కరణం వనిజ ఉ. 9:07 వరకు విష్టి రా. 9:29 వరకు వర్జ్యం తె. 5:02 నుండి ఉ. 6:44 వరకు దుర్ముహూర్తం ఉ. 10:13 నుండి ఉ. 11:03 వరకు మ. 3:11 నుండి సా. 4:01 వరకు రాహుకాలం మ. 1:50 నుండి మ. 3:23 వరకు యమగండం ఉ. 6:05 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:44 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు మ. 3:12 నుండి సా. 4:54 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:42 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# మెరుపులా వచ్చి... వరద ప్రళయం

## నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు



**160 మంది దుర్మరణం**

- వెయ్యి దాకా గల్లంతు
- అందులో 130 మంది భారతీయులే
- కొట్టుకుపోయిన ఊళ్లకు ఊళ్లు
- టిబెట్‌లో కానరాని మరో 265 మంది
- 31 మంది హైదరాబాదీ బృందం క్షేమం



నేపాల్‌పై వరద విరుచుకుపడింది. టిబెట్‌లో ప్రారంభమైన ఆకస్మిక వరద నేపాల్ గ్రామాలు, పట్టణాలను ముంచెత్తింది. ఈ విపత్తులో ఇప్పటివరకు 160 మంది మృతి చెందగా.. దాదాపు వెయ్యి దాకా గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లి తిరిగి వస్తున్న ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది యాత్రికులు వారిలో ఉన్నారు. వీరంతా ఎన్నారైలు కాగా.. ప్రవాస భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఖట్మండు: మరో 37 మంది తంజావూర్‌కు చెందిన తమిళులు కూడా గల్లంతయ్యారు. టిబెట్‌లోనూ వరదలు, కొండచరియలు బీభత్సం సృష్టించాయి. అక్కడ 265 మంది కనిపించకుండా పోగా.. ముగ్గురు మరణించారు. నేపాల్‌లో వరద ప్రవాహానికి భవనాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. దాదాపు డజను జలవిద్యుత్తు కేంద్రాలు తీవ్రంగా దెబ్బతినడంతో తరువాయి 2 వ పేజీలో...



## నేడు ఉద్యోగుల మహా ధర్నా

2




### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,397 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,781 |

### విశ్వవాణి



భారత్‌కు చెందిన ముగ్గురు టీనేజర్లు ధ్రువ్ చౌదరి, మిథ్రన్ లధానియా, మృదుల్ జైన్.. 'థర్మావాల్ట్' పేరుతో విద్యుత్, బ్యాటరీ అవసరం లేకుండా పనిచేసే పోర్టబుల్ శీతలీకరణ పరికరాన్ని రూపొందించారు. ఉప్పు, నీటిని ఉపయోగించే ఈ పరికరం 2-6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను 10-12 గంటల పాటు కొనసాగిస్తుంది. దీంతో విద్యుత్ సౌకర్యం సరిగా లేని ప్రాంతాల్లో టీకాలు, మందులను భద్రపరచేందుకు ఉపయోగపడుతుంది. పరికరానికి ఎర్త్ ప్రైజ్ ఆసియా-2025 అవార్డుతో పాటు 12,500 డాలర్ల నిధులు లభించాయి. త్వరలో 200 పరికరాలను తయారు చేసి 120 ఆసుపత్రులకు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

# సుస్మితది వాక్‌స్వాతంత్ర్యం



- మాట్లాడే హక్కు ఆమెకు ఉంది
- ఆ వ్యాఖ్యలతో మాకేం సంబంధం?
- కూతురి వివాదంపై కొండా మురళి వ్యాఖ్య
- గాంధీ కుటుంబంపై విశ్వాసం ఉందని వెల్లడి
- కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): సుస్మిత వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై తన కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యల నేపథ్యంలో, ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. తాము 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, పార్టీ అధిష్ఠానం, గాంధీ కుటుంబంపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు. భట్టి విక్రమార్కను కలిసిన అనంతరం కొండా మురళి మాట్లాడుతూ.. "మా బిడ్డ వ్యాఖ్యలతో మాకు ఏం సంబంధం? మా బిడ్డకు స్వతంత్రంగా మాట్లాడే హక్కు

# తప్పంతా రేవంత్‌దే!?

## పరకాల సీటు ప్రకటనే ఆజ్యం పోసింది!.. అందువల్లే కొండా సుస్మిత తిరుగుబాటు!

### కాంగ్రెస్‌లో రేవంత్‌కు ప్రత్యామ్నాయ కేంద్రం?.. భట్టి-మురళి భేటీతో కొత్త సమీకరణాలు?

తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా లోలోపల నడుస్తున్న విభేదాలు ఇప్పుడు బహిరంగ రాజకీయ పోరాటంగా మారుతున్నాయి. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం, పరకాల అసెంబ్లీ టికెట్ చుట్టూ తిరుగుతూ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం, కాంగ్రెస్‌లోని అంతర్గత శక్తిసమీకరణాలు, అధిష్ఠానం పాత్ర, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాజకీయ ప్రాధాన్యత వంటి అంశాల వరకు విస్తరించింది.



(ఈవార్తలు - తెలంగాణ పొలిటికల్ బ్యూరో)

వివాదం మూలాల్లోకి వెళితే.. పరకాల ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడమే అసలు కారణం. ఈ వ్యాఖ్యలకు కౌంటర్‌గా కొండా సుస్మిత ప్రెస్‌మీట్ పెట్టి.. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని, కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఆమె ప్రకటించారు. ఈ క్రమంలో సీఎంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే, కాంగ్రెస్‌లో అసెంబ్లీ టికెట్లను తుది నిర్ణయం తీసుకునేది పార్టీ అధిష్ఠానమే. 2023 ఎన్నికల సమయంలోనూ రాష్ట్ర స్థాయిలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరిగినప్పటికీ, స్క్రీనింగ్ కమిటీ, తరువాయి 2 వ పేజీలో...



# మా మతం మా ఇష్టం

## హిజాబ్ తీర్పు ఇస్లాంపై దాడి

- ఏది అవసరమో చెప్పడానికి జడ్జిలు ఎవరు?
- అలహాబాద్ హైకోర్టు తీర్పుపై అసదుద్దీన్ ఫైర్

హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): పాఠశాల యూనిఫామ్‌తో పాటు హిజాబ్ ధరించడానికి అనుమతి కోరిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేయడంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# అమెరికా వీసా ఇంటర్వ్యూలకు బ్రేక్




### ఖరారైన అపాయింట్‌మెంట్ల రీషెడ్యూల్

అమెరికా వీసా కోసం ఇంటర్వ్యూకు సిద్ధమైన వారికి ట్రంప్ ప్రభుత్వం షాకిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో వీసా సేవల అపాయింట్‌మెంట్లను నిలిపివేయడం లేదా వాయిదా వేయడం ప్రారంభించింది. ఇప్పటికే ఖరారైన ఇంటర్వ్యూలను కూడా రీషెడ్యూల్ చేస్తున్నట్లు సమాచారం.

వాషింగ్టన్: విదేశాల్లోని అన్ని దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తున్న కాన్సులర్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ప్రభుత్వ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉన్నవారిని గుర్తించడంతోపాటు వీసా దరఖాస్తుదారుల పరిశీలనను మరింత సమగ్రంగా, ఒకే విధంగా నిర్వహించడమే లక్ష్యమని వెల్లడించింది. అయితే ఈ మార్పులు ఎంతకాలం కొనసాగుతాయనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే వీసా ఇంటర్వ్యూ తేదీలు ఖరారైన పలువురు దరఖాస్తుదారులకు అపాయింట్‌మెంట్లు మారినట్లు ఈ-మెయిల్స్ వెళ్లినట్లు 'ఫైనాన్షియల్ టైమ్స్' వెల్లడించింది. తరువాయి 2 వ పేజీలో...

# బీఏ, బీఎస్సీ, బీకాం వేస్ట్

## ఈ డిగ్రీలతో ఉద్యోగాలు కష్టం.. నీతి ఆయోగ్ తాజా నివేదిక




డిగ్రీ చదివితే ఉద్యోగం దొరుకుతుందనే పరిస్థితి ఇప్పుడు లేదని నీతి ఆయోగ్ తాజా నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా బీఏ, బీఎస్సీ, బీకాం వంటి సాధారణ డిగ్రీలకు ఉద్యోగాలతో సరైన అనుసంధానం లేదని పేర్కొంది. మారుతున్న పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు ఉన్నత విద్యలో మార్పులు రావాలని సూచించింది. దేశంలో 3.4 కోట్ల మంది విద్యార్థులు డిగ్రీ కోర్సులు చదువుతున్నారు. వీరిలో 1.13 కోట్ల మంది బీఏలోనే ఉన్నారు.

న్యూఢిల్లీ:ఒబీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో కలిపి 2 కోట్ల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీటిలో చాలా కోర్సులు ఉద్యోగ మార్కెట్ అవసరాలకు తగ్గట్టు లేవని నీతి ఆయోగ్ తెలిపింది. చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల అర్హత కోసం ఈ డిగ్రీలను ఎంచుకుంటున్నారని నివేదిక పేర్కొంది. 2024 నవంబర్ నుంచి 2025 జులై మధ్య కేవలం 55 వేల ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం పరిస్థితిని స్పష్టం చేస్తోంది. ప్రస్తుత కోర్సుల స్థానంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న -2 వ పేజీలో...

# పరాయి దేశంలో పరలోకాలకు!

### అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు తెలంగాణ యువకుల దుర్మరణం

నిజామాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఫ్లోరిడా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో మరణించిన వారిలో నిజామాబాద్ జిల్లా గూపన్‌పల్లికి చెందిన పుట్ట రాహుల్ అనే యువకుడు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉన్నత భవిష్యత్తు లక్ష్యంతో రాహుల్ మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. అక్కడ ప్రయాణిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన రోడ్డు తరువాయి 2 వ పేజీలో...





# ఆరుగురి మృత్యువాత

### హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తుండగా ఘటన

కోదాడ-సూర్యాపేట, ఆగస్టు 26 (ఈవార్తలు): సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న కంటైనర్ లారీని ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి తరువాయి 2 వ పేజీలో...



### బానిసత్వపు జరిమానా..

## 1.62 లక్షల కోట్లు

**అమెరికా రాష్ట్రాలతో మెటా రాజీ ఒప్పందం**

వాషింగ్టన్: టీనేజర్లను సోషల్ మీడియాకు బానిసలుగా మారుస్తోందంటూ 'మెటా'పై అమెరికాలోని 47 రాష్ట్రాలు చేస్తున్న -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

27.8.2026

**మేషం:** నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. కుటుంబ సభ్యులతో దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన వ్యవహారాలలో విజయం లభిస్తుంది. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో ఉంటాయి. బంధు మిత్రుల నుండి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం:** చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. వృధా ప్రయాణాలు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారములు మధ్యలో నిలిచిపోతాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు కలుగుతాయి. సన్నిహితులతో అకారణ విభేదాలు తప్పవు. అవసరానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

**మిథునం:** వ్యాపారపరంగా ఉన్న ఇబ్బందులు క్రమక్రమంగా తొలగుతాయి. సమాజంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. నూతన వాహన, గృహ యోగములు ఉన్నవి. చిన్ననాటి స్నేహితులతో పాత జ్ఞాపకాలు పంచుకుంటారు. నిరుద్యోగుల ప్రయత్నాలు కలిసివస్తాయి.

**కర్కాటకం:** నూతన వ్యవహారాలకు శ్రీకారం చుడతారు. దగ్గరి వారి నుండి కీలక విషయాలు తెలుస్తాయి. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశములు లభిస్తాయి. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పదవులు లభిస్తాయి. వ్యాపారమున లాభాలు కలుగుతాయి.

**సింహం:** దైవ సంబంధిత విషయములలో ఆసక్తి పెరుగుతుంది. చేపట్టిన పనులందు ఆటంకాలు తప్పవు. ఇంటా బయట సమస్యలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిన్నపాటి సమస్యలు తప్పవు. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి.

**కన్య:** సంతాన విద్యా విషయాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమాధిక్యత తప్పదు. వ్యాపార, ఉద్యోగాలలో ఆందోళనలు పెరుగుతాయి. ఆత్మీయులతో అకారణ కలహ సూచనలు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి.

**తుల:** వృత్తి, ఉద్యోగాలు సంతృప్తికరంగా ఉంటాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించుటకు అనుకూల సమయం. ఉన్నత విద్యా ప్రయత్నాలు కలిసివస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన సమావేశములకు ఆహ్వానాలు అందుతాయి. సంతాన శుభకార్య విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**వృశ్చికం:** చేపట్టిన వ్యవహారాలలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుంచి విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. కొత్త పరిచయాలు వలన ఆర్థిక లాభాలుంటాయి. వ్యాపార ఉద్యోగాలలో అభివృద్ధి కలుగుతుంది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు.

**ధనస్సు:** దూర ప్రయాణాలలో అవరోధాలు కలుగుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. మానసిక ప్రశాంతతకు దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి , ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. బంధు మిత్రుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి.

**మకరం:** వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం వలన నష్టాలు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. నిరుద్యోగ యత్నాలు కలిసిరావు. నూతన ఋణ ప్రయత్నాలు కలిసిరావు. ఇతరులతో ఆలోచించి మాట్లాడటం మంచిది.

**కుంభం:** భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. ఆత్మీయులతో ఉన్న వివాదాలకు పరిష్కారం లభిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

**మీనం:** చేపట్టిన పనులందు శ్రమ అధికమౌతుంది. ఇతరులతో కొన్ని విషయాలలో మాట పట్టింపులు పెరుగుతాయి. గృహ నిర్మాణ పనులు వాయిదా వేస్తారు. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. దాయాదులతో స్థిరాస్తి విషయమై ఉన్న సమస్యలు కొంత ఆందోళన కలిగిస్తాయి.

# ..వరద ప్రళయం

మొదటి పేజీ తరువాయి

పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. అమెరికా భూగర్భ పరిశోధనా సంస్థ (యూఎస్‌జీఎస్) అంచనా ప్రకారం.. బుధవారం ఉదయం 8.37 గంటలకు టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. దాని ప్రభావంతో టిబెట్–నేపాల్ సరిహద్దులోని పర్వత ప్రాంతంలో భారీ కొండచరియ విరిగిపడింది. దీంతో లిండే నది ఒక్కసారిగా ఉప్పొంగింది. ఈ వరద భోటే కోషి నది ద్వారా త్రిశూలి నదిలోకి భారీగా దూసుకురావడంతో విపత్తు సంభవించింది. వర్షాల కారణంగా ఈ వరద సంభవించలేదని నేపాల్ వాతావరణశాఖ వెల్లడించింది. భూకంపం కారణంగా కొండచరియలు విరిగిపడటంతోనే ఒక్కసారిగా భారీగా నీరు, బురద ప్రవహించినట్లు అధికారులు తెలిపారు.

ఏడు జిల్లాల్లో విధ్వంసం

బుధవారం ఉదయం 9 గంటల సమయంలో భోటే కోషి నది నుంచి ఒక్కసారిగా వరద ప్రవాహం మొదలైంది. తొలుత టిబెట్ సరిహద్దులోని నేపాల్ జిల్లాలైన రసువా, ధాడింగ్‌లను ముంచెత్తిన వరద.. ఆ తర్వాత నువాకోట్, చితావన్, గూర్ఖా, తనాహు, నవాల్‌పారసీ తూర్పు జిల్లాలకు విస్తరించింది. మొత్తంగా ఏడు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఖట్మండుకు 125 కిలోమీటర్ల దూరంలో ఉన్న రసువా జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వరద ప్రవాహం వేగం ఎంత తీవ్రంగా ఉందంటే.. ప్రజలు నీటి శబ్దం విని ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసేలోపే బురద, నీరు వారిని చుట్టుముట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న దృశ్యాలు వరద బీభత్సాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. వరద ధాటికి 384 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 8 జలవిద్యుత్తు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. నిర్మాణంలో ఉన్న మరో 4 కేంద్రాలు కూడా దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. నాలుగంతస్తుల భవనం వరదలో కొట్టుకుపోయిన ఘటన పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరో ప్రాంతంలో పొడవైన వంతెన వరద ఉధృతికి రెండుగా చీలిపోయింది. వరదల్లో నేపాల్ భద్రతా సిబ్బందికి కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. 80 మంది భద్రతా సిబ్బంది గల్లంతయ్యారు. వారిలో 44 మంది సైనికులు ఉన్నారు. రసువా జిల్లాలో 384 మంది పర్యాటకులు గల్లంతైనట్లు నేపాల్ పర్యాటక బోర్డు వెల్లడించింది. వారిలో 341 మంది విదేశీయులు ఉన్నారు. గల్లంతైన భారతీయుల్లో అమెరికా, బ్రిటన్, మలేసియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ తదితర దేశాల్లో నివసిస్తున్న ప్రవాస భారతీయులు ఉన్నట్లు సమాచారం.

సహాయక చర్యలు ముమ్మరం

విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. 12 హెలికాప్టర్లతో సైన్యం సహాయక చర్యలు చేపడుతోంది. ఇప్పటివరకు దెబ్బతిన్న ప్రాంతాల నుంచి 100 మందిని రక్షించారు. వారిలో 30 మందిని కాఠ్‌మాండూలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఐదు డ్రోన్లను కూడా వినియోగిస్తున్నారు. విపత్తు సమాచారం అందిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్‌లో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భారత ఎయిర్‌ఫోర్స్ విమానాల ద్వారా ఔషధాలు, ఆహారం తదితర సామగ్రిని నేపాల్‌కు పంపించారు. మరోవైపు, నేపాల్‌లో భారీ వరదల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలైన బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. గండక్ నది ఉప్పొంగే అవకాశం ఉందన్న అంచనాలతో బీహార్‌లోని వాల్మీకి నగర్ బ్యారేజీ 36 గేట్లను అధికారులు ముందుగానే ఎత్తివేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్, ఖుషీనగర్ జిల్లాల్లో గండక్ నదీ తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అక్కడ జాతీయ విపత్తు స్పందనా దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

# తప్పంతా రేవంత్‌దే!?

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ఎన్నికల కమిటీ వంటి వ్యవస్థల ద్వారా అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషించినప్పటికీ, తుది నిర్ణయం ఆయన వ్యక్తిగత నిర్ణయంగా ఉండేది కాదు. ఇదే విషయాన్ని ప్రస్తుత వివాదంలో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా స్పష్టం చేసినట్లు సమాచారం. కొండా సురేఖ ఖర్గేను కలిసిన సందర్భంలో, నియోజకవర్గాల అభ్యర్థులను ఏకపక్షంగా ప్రకటించడం సరికాదని, టికెట్లపై నిర్ణయం ఏఐసీసీ ఎన్నికల వ్యవస్థ తీసుకుంటుందని ఖర్గే సూచించినట్లు వార్తలు వచ్చాయి.

పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డినే వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని సీఎం బహిరంగంగా చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? అన్నదే రాజకీయ విశ్లేషకుల క్వశ్చన్. ప్రస్తుత ఎమ్మెల్యేను అభినందించడం ఒక విషయం. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయనే అభ్యర్థి అన్న భావన కలిగించేలా బహిరంగ సభలో ప్రజలను కోరడం మరో విషయం. ముఖ్యంగా అదే నియోజకవర్గంలో మరో బలమైన రాజకీయ కుటుంబం టికెట్‌పై ఆసక్తి చూపుతున్న పరిస్థితుల్లో ఇలాంటి ప్రకటన రాజకీయంగా సహజంగానే ప్రతిస్పందనకు దారితీస్తుంది. అందుకే "రేవంత్ వ్యాఖ్యే కొండా కుటుంబాన్ని బహిరంగ పోరాటానికి నెట్టిందా?" అనే ప్రశ్నకు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం పెరిగింది. రాజకీయ విశ్లేషకుల ఒక వర్గం వాదన ప్రకారం, ఈ వివాదానికి మూలకారణం సుస్మిత వ్యాఖ్యలు కావు. అంతకుముందే సీఎం చేసిన పరకాల ప్రకటన. కాంగ్రెస్‌లో టికెట్ ఇవ్వడం సీఎం వ్యక్తిగత హక్కు కాదు. అయితే సీఎం ఒక నియోజకవర్గంలో ఒక నేతను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిస్తే, పార్టీ శ్రేణుల్లో దానికి రాజకీయ అర్థం ఏర్పడుతుంది. ముఖ్యంగా టికెట్ కోసం పోటీలో ఉన్న ఇతర ఆశావహులకు అది సంకేతంగా కనిపిస్తుంది. ఇక్కడే రేవంత్ రాజకీయంగా జాగ్రత్త కోల్పోయారని విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే కాంగ్రెస్‌లో టికెట్ విషయంలో అంతిమ అధికారం ఏఐసీసీదేనని చెప్పే వ్యవస్థ ఉన్నప్పుడు, ఒక నియోజకవర్గంలో ముందుగానే అభ్యర్థిని నిర్ణయించినట్టుగా కనిపించే వ్యాఖ్య చేయడం అవసరంలేని వివాదానికి తలుపులు తెరిచిందనే అభిప్రాయం ఉంది. ఇదే సమయంలో మరో ప్రశ్న కూడా ఎదురవుతోంది. జగ్గారెడ్డి విషయంలో టికెట్ నిర్ణయం ఏఐసీసీదేనని చెబుతున్నప్పుడు, పరకాల విషయంలో మాత్రం ముందుగానే ఒక నాయకుడికి మద్దతు ఎందుకు ప్రకటించాలి? ఈ వైరుధ్యమే కొండా కుటుంబానికి రాజకీయ ఆయుధంగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక్కడే మరో ముఖ్యమైన అంశం ఉంది. రేవంత్ వ్యాఖ్యను తప్పుబట్టవచ్చని అనుకున్నా, దానికి ప్రతిస్పందనగా ముఖ్యమంత్రిపై వ్యక్తిగత స్థాయిలో తీవ్ర వ్యాఖ్యలు చేయడం, స్వతంత్రంగా పోటీ చేస్తానని బహిరంగంగా ప్రకటించడం మాత్రం కాంగ్రెస్ క్రమశిక్షణ పరిధిలో ప్రశ్నలను లేవనెత్తింది. అందుకే కాంగ్రెస్‌లోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చర్యలు తీసుకోవాలని కోరారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ కూడా కొండా సురేఖపై చర్యకు సిఫార్సు చేసినట్లు తాజా సమాచారం చెబుతోంది. అంటే ఈ వ్యవహారంలో రెండు వేర్వేరు ప్రశ్నలు ఉన్నాయి. రేవంత్ చేసిన రాజకీయ తప్పు ఒకటి. సుస్మిత చేసిన బహిరంగ తిరుగుబాటు మరోటి. ఒకదానిని మరొకటి సమర్థించడానికి ఉపయోగించడం రాజకీయంగా సులభమే కానీ, రెండింటినీ ఒకే కొలమానంతో చూడటం మాత్రం సరైంది కాదు. సుస్మిత వ్యాఖ్యలపై తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తన కుమార్తెకు స్వతంత్రంగా అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ఉందని, ఆమె వ్యాఖ్యలకు తనను రాజకీయంగా బాధ్యురాలిని చేయడం సహజ న్యాయానికి విరుద్ధమని క్రమశిక్షణ కమిటీకి ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు. ఇది కొండా కుటుంబం తీసుకున్న రక్షణాత్మక రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే కాంగ్రెస్ నాయకత్వం దానిని పూర్తిగా అంగీకరించినట్లు కనిపించడం లేదు. పార్టీకి చెందిన నాయకులు ఇప్పటికే సుస్మిత వ్యాఖ్యలను ముఖ్యమంత్రిపై నేరుగా దాడిగా చూస్తున్నారు. అందుకే వివాదం ఇప్పుడు "సుస్మిత ఏమన్నారు?" అనే స్థాయి దాటి "మంత్రి కుటుంబం పార్టీ క్రమశిక్షణకు లోబడి ఉందా?" అనే ప్రశ్నగా మారింది. ఇదే సమయంలో రాజకీయంగా మరింత ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొండా సురేఖ బెంగళూరుకు వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. తనను, తన కుటుంబాన్ని కొందరు నేతలు రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆమె వివరించినట్లు వార్తలు వచ్చాయి. ఇది ఒక సాధారణ వివరణ సమావేశంగా చూడాలా? లేక రాష్ట్ర కాంగ్రెస్‌లో తమకు ఢిల్లీ స్థాయిలో రక్షణ కల్పించుకునే ప్రయత్నంగా చూడాలా? అన్న చర్చ మొదలైంది. అయితే ఖర్గే వైపు నుంచి వచ్చిన సంకేతం మాత్రం కొండా కుటుంబానికి పూర్తిగా అనుకూలంగా లేదన్నది రాజకీయ వర్గాల అంచనా. ముఖ్యమంత్రిపై బహిరంగంగా మాట్లాడటం, ఏ నియోజకవర్గంలోనైనా ముందుగానే పోటీ హక్కును ప్రకటించుకోవడం పార్టీ విధానాలకు అనుగుణం కాదని ఆయన సూచించినట్లు వార్తలు వెల్లడిస్తున్నాయి. అంటే ఢిల్లీ ఇప్పటివరకు రేవంత్‌కు సంపూర్ణ మద్దతు లేదా కొండా కుటుంబానికి సంపూర్ణ మద్దతు అనే రెండు అంచుల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకున్నట్లు కనిపించడం లేదు.

## నేడు ఉద్యోగుల మహా ధర్నా

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రత్యక్ష కార్యాచరణకు దిగారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ స్థాయిలో 'మహా ధర్నా' నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మహా ధర్నా జరగనుంది. రాజధానిలోనే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల సమీకృత కలెక్టరేట్ల ముందు కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# మా మతం మా ఇష్టం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని దారుస్సలాంలో జరిగిన 'జల్సా–ఎ–రహ్మతుల్–లిల్–అలమీన్' సభలో ఆయన మాట్లాడుతూ, ఈ తీర్పు ఇస్లాంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ తీర్పుతో తాను ఏకీభవించనని, ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 19లను ఉల్లంఘించడమేనని ఒవైసీ అన్నారు. "ఇస్లాంలో ఏది అవసరమో, ఏది కాదో నిర్ణయించడానికి మీరెవరు? అమ్మాయిలు హిజాబ్‌ను తలపై ధరిస్తారు కానీ, మెదడుపై కాదు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. శబరిమల కేసులో మతపరమైన ఆచారాలపై సుప్రీంకోర్టులో విచారణ ఇంకా పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆరెస్సెస్, బీజేపీలపై కూడా ఒవైసీ తీవ్ర విమర్శలు చేశారు. వారికి భారత రాజ్యాంగం కంటే మనుస్మృతే ఎక్కువ ఇష్టమని, బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని వారు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ సిద్ధాంతకర్త సావర్కర్‌పై విమర్శలు చేస్తూ, అండమాన్ జైలులో ఆయన బ్రిటిష్ వారికి క్షమాపణ లేఖలు రాశారని, కానీ ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు మాత్రం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జిహాద్‌కు ఫత్వా జారీ చేసి, కఠిన శిక్షలు అనుభవించారని పోల్చారు. అండమాన్ జైలుకు వెళ్లిన మొదటి ఖైదీ హైదరాబాద్ మక్కా మసీదు ఇమామ్ మౌల్వీ అలావుద్దీన్ అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్, అసోం, గుజరాత్‌లలో అమలు చేస్తున్న యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)పై కూడా ఒవైసీ స్పందించారు. హిందూ వివాహ, విడాకులు, వారసత్వ చట్టాల ఆధారంగా రూపొందించిన చట్టాలను యూసీసీ అని ఎలా అంటారని, వాటిని ముస్లింలపై ఎందుకు రుద్దాలని ప్రశ్నించారు. తమను తమ మతం నుంచి దూరం చేయాలని చేసే ప్రయత్నాలు ఫలించవని, తాము ఖురాన్‌ను అనుసరిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తాము ఈ దేశాన్ని ప్రేమిస్తామని, దేశాన్ని కాపాడుకుంటూనే భారత్‌ను సూపర్ పవర్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఒవైసీ పేర్కొన్నారు. హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు.

## తెలంగాణ వాసులకు హెల్ప్ లైన్

హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): నేపాల్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా అక్కడ చిక్కుకున్న లేదా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. నేపాల్‌లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అక్కడ ఉన్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, సమన్వయ కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

హెల్ప్‌లైన్ నంబర్లు:

వందన, పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్

9871999044

సీహెచ్ చక్రవర్తి. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్

9949351270

జీ రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్9618597969

బానిసత్వపు జరిమానా.. 1.62 లక్షల కోట్లు

## బానిసత్వపు జరిమానా.. 1.62 లక్షల కోట్లు

మొదటి పేజీ తరువాయి

న్యాయపోరాటంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుల విచారణను ముగించేందుకు దాదాపు 17 బిలియన్ డాలర్లు (రూ. 1.62 లక్షల కోట్లు) చెల్లించేలా రాజీ ఒప్పందానికి మెటా ముందుకొచ్చింది. అదేవిధంగా తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌లలో మరిన్ని చైల్డ్ సేఫ్టీ చర్యలు తీసుకునేందుకు మెటా అంగీకరించిందని అటార్నీ జనరల్స్ ప్రకటించారు. "సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు పిల్లలను బానిసలుగా మార్చేలా ఉన్న ఫీచర్ల గురించి మెటా ఏళ్ల తరబడి ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టించింది. దీంతో పిల్లల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. అంతేకాకుండా.. 13 ఏళ్లలోపు పిల్లలకు సంబంధించిన డేటాను వారి తల్లిదండ్రుల అనుమతి లేకుండా సేకరించింది" అని మెటాపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. 2021లో 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ప్రచురించిన కథనాల ఆధారంగా ఈ విచారణకు బీజం పడింది. ఇన్‌స్టాగ్రామ్ వల్ల టీనేజర్ల, ముఖ్యంగా అమ్మాయిల మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్నట్లు మెటాకు ముందే తెలుసని ఆ కథనాలు వెల్లడించాయి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఉపయోగించే పిల్లల కోసం రోజువారీ సమయ పరిమితులు విధించడం, పాఠశాల సమయంలో పుష్ నోటిఫికేషన్లు నిలిపివేయడం, వయసు తనిఖీని కఠినతరం చేయడం, కంటెంట్ కంట్రోల్స్‌ను ఏర్పాటు చేయడం, తల్లిదండ్రుల పర్యవేక్షణను మెరుగుపర్చడం వంటి చర్యలు తీసుకుంటామని మెటా తెలిపింది. మెటా ప్రమాదకర ధోరణులకు ఈ ఒప్పందం ముగింపు పలుకుతుందని వర్జీనియా అటార్నీ జనరల్ జే జోన్స్ పేర్కొన్నారు.

## ఆరుగురి మృత్యువాత

మొదటి పేజీ తరువాయి

బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ఏలూరుకు 42 మంది ప్రయాణికులతో ఈ ప్రైవేటు బస్సు బయలుదేరింది. కోదాడ సమీపంలోని దొరకుంట వద్దకు రాగానే, జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్‌ను డ్రైవర్ గమనించకపోవడంతో వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలుసుకునే లోపే ఘోరం జరిగిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 42 మంది ఉన్నారు. మృతుల్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉండగా, మరొకరి వివరాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్‌ల ద్వారా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## బీఏ, బీఎస్సీ, బీకాం వేస్ట్

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక కోర్సులను తీసుకురావాలని నీతి ఆయోగ్ సూచించింది. బీఏ హాస్పిటాలిటీ, బీకాం అనలిటిక్స్, బీఎస్సీ అప్లైడ్ టెక్నాలజీ వంటి కోర్సులను ఉదాహరణగా పేర్కొంది. చదువుతో పాటు పని అనుభవం వచ్చేలా అప్రెంటిస్‌షిప్ ఆధారిత డిగ్రీలను పెంచాలని తెలిపింది. పార్ట్‌టైమ్, హైబ్రిడ్, మాడ్యులర్ కోర్సులను విస్తరించాలని నివేదిక సూచించింది. చదువుకుంటూనే పనిచేసే అవకాశాలు కల్పించాలని పేర్కొంది. పరిశ్రమల భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో ఉద్యోగ ఆధారిత నైపుణ్య శిక్షణను పెంచాలని స్పష్టం చేసింది.

## అమెరికా వీసా ఇంటర్వ్యూలకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి

కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని అందులో పేర్కొన్నట్లు సమాచారం. రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. వీసాలు, గ్రీన్‌కార్డుల రద్దు, వివిధ కారణాలతో దరఖాస్తుల తిరస్కరణ వంటి చర్యలను వేగవంతం చేశారు. తాజాగా హెచ్–1బీ వీసా విధానంలోనూ భారీ మార్పులకు అమెరికా ప్రభుత్వం ప్రతిపాదనలు పరిశీలిస్తోంది. ఇది వేలాది మంది భారతీయ ఐటీ నిపుణులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పర్యాటక, వ్యాపార వీసాలతో అమెరికాకు వెళ్లి తర్వాత ఆశ్రయం కోరుతూ అక్కడే ఉండేందుకు ప్రయత్నించిన దాదాపు రెండు లక్షల మంది విదేశీయుల వీసాలను రద్దు చేయాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోంది. దేశీయ భద్రత కోసమే ఈ కఠిన చర్యలని ట్రంప్ చెబుతున్నారు. అయితే ట్రంప్ వలస విధానాలపై మానవ హక్కుల సంస్థలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. చట్టబద్ధ వలసలకూ కొత్త అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నాయి.

## సుస్మితది వాక్‌స్వాతంత్ర్యం

మొదటి పేజీ తరువాయి

ఉంది. ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. సుస్మితను ప్రశ్నించే హక్కు మాకు లేదు" అని అన్నారు. సుస్మిత తనకు తగ్గట్టుగా తాను ఉంటుందని, ఆమె చేసిన వ్యాఖ్యలపై తాము బాధ్యత వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో సుస్మిత వ్యాఖ్యలపై తాను భట్టి విక్రమార్కతో చర్చించలేదని మురళి తెలిపారు. ఓ బిల్లు విషయంలో ఆయన్ను కలిసినట్లు వెల్లడించారు. మంత్రి కొండా సురేఖ అందుబాటులో లేరంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన తమకు లేదని కొండా మురళి స్పష్టం చేశారు. 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, గాంధీ కుటుంబంపై సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు.

## పరాయి దేశంలో పరలోకాలకు!

మొదటి పేజీ తరువాయి

ప్రమాదంలో అతడు ప్రాణాలు కోల్పోవడంతో స్వగ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అమెరికా వెళ్లి కొద్దిరోజులకే రాహుల్ మృతి చెందాడనే వార్త వినడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి, ముగ్గురు యువకులు మరణించినట్లు సమాచారం వచ్చిందని రాహుల్ తండ్రి తెలిపారు. ఈ ప్రమాదంలో రాహుల్ చనిపోయాడని కన్నీటి పర్యంతం అయ్యారు.

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

**రాహుల్ గాంధీకి బీజేఎల్పీ నేత ఏలేటి లేఖ**



హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ సాగిస్తున్న 'సెక్షన్ 22-ఏ' భూ దోపిడీని ఎండగడుతూ ఎంపీ రాహుల్ గాంధీకి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. అవినీతికి పాల్పడుతున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేసి, ఈ మహా కుంభకోణంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారత జాతీయ కాంగ్రెస్ సాగిస్తున్న అరాచక పాలనలో ప్రజలపై జరుగుతున్న తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘనను, వ్యవస్థాగతంగా సాగుతున్న భూ దోపిడీ దందాను మీ దృష్టికి తీసుకురావడానికి ఈ లేఖ రాస్తున్నాను. మీరు దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని చేత పట్టుకుని, ప్రజాస్వామ్య విలువలు, నిజాయితీ, పారదర్శకతలకు మీరే అసలైన రాజ్యాగాన్ని కాపాడుతున్న వ్యక్తులుగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ మీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని వాస్తవ పరిస్థితులు మీ ద్వంద్వ వైఖరినీ ప్రజల కళ్ళకు కట్టినట్లు బట్టబయలు చేస్తున్నాయి. తెలంగాణలో మీ పార్టీ కనుసన్నల్లోనే లక్షలాది మంది ప్రజల రాజ్యాంగ హక్కులు కాలరాయబడుతున్నాయి, చట్టబద్ధ హక్కులు కలిగిన భూ యజమానులను వేధింపులకు గురిచేసి వారిని దీపిడీ చేస్తున్నారు, అలాగే రాష్ట్ర రెవెన్యూ యంత్రాంగాన్ని రాజకీయ నిధుల సమీకరణకు వేదికగా మార్చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300-ఏ, చట్టబద్ధమైన అధికారం ద్వారా తప్ప ఏ వ్యక్తి ఆస్తిని కూడా హరించరాదని స్పష్టంగా నిర్దేశిస్తుంది. అయినప్పటికీ, 1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏను ఒక ఆయుధంగా ఉపయోగించడం ద్వారా, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన పట్టాదారులైనా, చిన్న, సన్నకారుకారు రైతులు వారితో పాటు మధ్యతరగతి కుటుంబాల హక్కులను కలుస్తుంది. ఈ 22ఏ సెక్షన్ అనేది చట్టబద్ధమైన ప్రభుత్వ, సామాజిక ఆస్తులను పరిరక్షించడానికి ఉద్దేశించినది, ప్రభుత్వం ఈ సెక్షన్ ను దోపిడీకీ అవసరమైన ఒక సాధనంగా మార్చి వాడుకుంటుంది. చట్టబద్ధమైన భూ యజమానుల భూములు అకస్మాత్తుగా రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేర్చబడ్డాయి. ఇంట్లో ఎవరికైనా ఒంట్లో బాగోలేక ఆసుపత్రి పాలైనా, పిల్లల చదువులకైనా, ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలన్నా సొంత భూమి అమ్ముకోలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అధికారుల చుట్టూ సామాన్యులను తిప్పుకుంటూ జరుగుతున్న వ్యవస్థాగత అవినీతికి పాల్పడుతూ, మా భూమిని మాకు ఇవ్వడానికి లక్షలకు లక్షలు లంచాలు చెల్లించవలసి వస్తుంది. ఈ సంక్షోభం పరిపాలనాపరమైన పొరపాటు కాదు, పూర్తిగా పథకం ప్రకారం సాగుతున్న వ్యాపార దందా. మీ పార్టీకే చెందిన సీనియర్ క్యాబినెట్ మంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్వయంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోనే దాదాపు 42,000 ఎకరాలను ఏకపక్షంగా, అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చడాన్ని బహిరంగంగా ఎత్తిచూపి ఈ కుట్రను బయటపెట్టారు. తెలంగాణ ప్రజలు ఈ విధ్వంసకర భూ దోపిడీ వసూళ్లకు ముగింపు పలకాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మీ పార్టీ చర్యలపై స్పష్టమైన, నిస్సందేహమైన సమాధానాన్ని ఆశిస్తున్నారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

## అవును! సుస్మిత టచ్‌లో ఉంది: జనసేన

హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత తమతో టచ్‌లో ఉందని జనసేన పార్టీ బాంబు పేల్చింది. తమ పార్టీ వరంగల్ నేతలతో టచ్‌లో సుష్మిత ఉందని జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ శంకర్ గౌడ్ అన్నారు. సుష్మితతో పాటు కొండా మురళి, సురేఖ వస్తే పార్టీలోకి ఆహ్వానిస్తామని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వాళ్లు పార్టీలోకి వస్తే పార్టీ బలోపేతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే, ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా జనసేనలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో టచ్‌లో ఉన్నారని వెల్లడించారు. గతంలో ప్రజారాజ్యం పార్టీలో పని చేసిన చాలామంది నేతలు, యూత్, మేధావులు కూడా తమతో టచ్‌లో ఉన్నారని, వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో వీళ్లందరితో కలిసి ముందుకెళ్తామని శంకర్ గౌడ్ తెలిపారు.

## బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితికి వ్యతిరేకంగా నిరసన

**ఉత్సవ కమిటీలో అగ్రవర్ణాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ధర్నా**

బాలాపూర్, ఆగస్టు 26 (ఈవార్తలు): బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితిలో కేవలం అగ్రవర్ణాల వారికే ప్రాధాన్యం ఇస్తూ, బడుగు బలహీన వర్గాల ప్రజలను దూరంగా పెడుతున్నారంటూ బుధవారం బాలాపూర్ గణేశ్ మండపం వద్ద కొందరు స్థానికులు నిరసన ధర్నా చేపట్టారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ఉత్సవ సమితిపై ఉందని ఈ సందర్భంగా బొర్ర రవి పేర్కొన్నారు. గణనాథుడికి సేవ చేసుకునే భాగ్యాన్ని తమకు కూడా కల్పించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. బాలాపూర్ లడ్డూ కేవలం ఒకే వర్గానికి (రెడ్డి వర్గానికి) మాత్రమే వరంగా మారుతోందని, ఈ విషయమై కమిటీ సభ్యులను ప్రశ్నిస్తే తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, స్వామివారి హుండీ ఆదాయం, దానికి సంబంధించిన లెక్కలను కూడా బయటకు బహిర్గతం చేయడం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్సవ సమితి ఇదే రకమైన మొండి వైఖరిని కొనసాగిస్తే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించి, తమ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక ఈ నిరసన ధర్నాకు స్థానికుడైన పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

## కేసీఆర్ కోసం ఏపీ నాశనం చేశారు: కొల్లు రవీంద్ర

విజయవాడ, ఆగస్టు 26 (ఈవార్తలు): 2019-2024 మధ్య కాలంలో తెలంగాణ అభివృద్ధి పథంలో పయనించగా, అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్‌కు తలొగ్గి జగన్ రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర ద్రోహం చేశారని ఆయన విమర్శించారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో ఏకంగా 102 ప్రాజెక్టుల టెండర్లను రద్దు చేసి అభివృద్ధిని వెనక్కి నెట్టారని, ఆయన హయాంలో జరిగిన అరాచకాలు, దోపిడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని మండిపడ్డారు. చట్టసభలు, అసెంబ్లీ సమావేశాలకు జగన్ హాజరుకాకుండా కేవలం ప్రెస్‌మీట్‌లకే పరిమితం కావడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడే జగన్, తన పాలనలో రైతులకు అసలు ఏం మేలు చేశారో చెప్పాలని నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో తమ కూటమి ప్రభుత్వానికి, జగన్ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ... తమ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.13,500 కోట్లు ఖర్చు చేయగా, జగన్ తన ఐదేళ్ల కాలంలో వెలుగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.800 కోట్లు మాత్రమే వెచ్చించారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా 'ఎల్‌నినో' ప్రభావం ఉన్నప్పటికీ, ఇలాంటి ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొల్లు రవీంద్ర కొనియాడారు.

## పోలవరం స్పిల్ వే 48 గేట్లు ఎత్తివేత

విజయవాడ, ఆగస్టు 26 (ఈవార్తలు): గత రెండు, మూడు రోజులుగా తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాలలో పడుతున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద నీరు పోటెత్తుతుంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం తీవ్రతరమైంది. ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్ వే వద్ద నీటిమట్టం 30.20 మీటర్లుగా నమోదైంది. వరద నీటిని క్రమబద్ధీకరించేందుకు అధికారులు స్పిల్ వేకు చెందిన 48 గేట్లను ఎత్తివేసి, దిగువకు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరద ప్రభావంతో దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరుకోవడంతో అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## ఏపీ అంతటా 'సంజీవని': చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో, దీనిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ రికార్డులు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన చికిత్స, ఆ తర్వాత ఫాలో-అప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో పెను మార్పులు తీసుకురావచ్చని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## భట్టి-రాజగోపాల్ రెడ్డి భేటీ

### అభివృద్ధి, నిధుల కోసమే కలిశానన్న కోమటిరెడ్డి



హైదరాబాద్, ఆగస్టున 26 (ఈవార్తలు): తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రిని కలిసిన ఆయన, కేవలం నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కేటాయింపులపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి, తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సీనియర్ నాయకుడినని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తాను తీవ్రంగా వ్యతిరేకించానని, 2018 ఎన్నికల్లో ఎంతోమంది సీనియర్లు ఓటమి పాలైనప్పటికీ మునుగోడు ప్రజలు తన వెంటే నిలిచారని ఆయన గుర్తుచేశారు. తన వ్యాఖ్యలు పార్టీ బలోపేతం కోసమే తప్ప, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించేందుకు కాదని స్పష్టం చేశారు. "మాది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తం. ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన వారికి టికెట్లు కేటాయించారు. అయితే, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై స్పందిస్తూ, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

**ఆంధ్రా చానళ్ల బోడి సర్టిఫికెట్ మాకొద్దు**

రేవంత్ రెడ్డికి బాకా పనులు చేసుకోవచ్చని, కానీ తమ జోలికొస్తే ఖబర్దార్ అంటూ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఓవైపు రేవంత్ బ్యాచ్‌కు డైరెక్ట్ వార్నింగ్ ఇస్తూనే మరోవైపు ఏబీఎన్ మీడియా ఛానల్ రాధాకృష్ణ పేరు తీసి ఆయనపై ఊగిపోయారు. 'ఫేక్ కథనాలు, క్రమశిక్షణ కమిటీ రిపోర్టుల డ్రామాలకు బెదిరేది లేదు. మాకు కాంగ్రెస్‌తో పంచాయతీ లేదు. తెలంగాణ ఉద్యమం చేసినోళ్లం.. ఎవడికీ భయపడేది లేదు. ఉద్యమంలో పాల్గొన్నోళ్లకే పదవులు రావాలి. సోదరా ఏబీఎన్ రాధాకృష్ణ మా గురించి రాసే ముందు చూసుకొని రాయి. లేకుంటే బాగుండదు. కొంచెం ఒళ్లు దగ్గర పెట్టుకొని మర్యాదగా ఉంటే మంచిది. ఏబీఎన్ లాంటి 100 ఛానళ్లు పెట్టే శక్తి మాకూ ఉంది. మేం అనుకుంటే ఇక్కడ ఏ ఛానల్ ఉండదు, ఏ పేపర్ ఉండదు. మీడియా అంటే, జర్నలిస్టులు అంటే నాకు గౌరవం ఉంది. ఇప్పుడు ఏబీఎన్ ఛానల్ ఎవరికి సపోర్ట్ చేస్తుంది? మా గురించి రాసేటప్పుడు జాగ్రత్తగా రాయాలి. మీడియా ముసుగులో తెలంగాణలో మాలాంటి రాజకీయ నాయకులని కించపరిచే విధంగా చేస్తున్న ఆంధ్ర మీడియా ఛానళ్లకు వార్నింగ్ ఇస్తున్నా. ఆంధ్ర మీడియా ఛానళ్లు మాకు సర్టిఫికేట్ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఫేక్ స్టోరీలతో మమ్మల్ని కంట్రోల్ చేయలేరు. ఆంధ్రా మీడియా ఛానెల్ మాకు అవసరం లేదు. ఆంధ్రా మీడియా బోడి సర్టిఫికెట్ మాకు అక్కర్లేదు' అని వార్నింగ్ ఇచ్చారు.

## కేసీఆర్‌ది సంక్షేమ పాలన.. రేవంత్‌ది భూముల పాలన

**కాంగ్రెస్ నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు దెబ్బ**

**మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు**



హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## నూతన గృహ ప్రవేశాలకు సంజయ్ హాజరు

జగిత్యాల, ఆగస్టు 26 (ఈవార్తలు): జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో బాసోజు రవి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి కుటుంబానికి చీరను కానుకగా అందజేశారు. అలాగే పట్టణంలోని 34వ వార్డుకు చెందిన నూతిపెల్లి కవిత-సురేష్ దంపతుల ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్యప్రణవ్, కోఆప్షన్ సభ్యుడు గట్టు సతీష్, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మాజీ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ సెల్ చాంద్ పాషా, కౌన్సిలర్ 16వార్డ్ దుమాల రాజ్‌కుమార్, కమాల్, 34 వార్డ్ కౌన్సిలర్ ఆయుబ్ ఖాన్, నాయకులు ఖయ్యూమ్, జిల్లా యువజన ఉపాధ్యక్షుడు సాయి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు చెట్టే భార్గవ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

**సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.**



## ఏపీలో భయంకర కరువు: జగన్

తాడేపల్లి, ఆగస్టు 26 (ఈవార్తలు): ఏపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ... పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

# 22ఏ భూములపై పోరాటం ఉధృతం



కూకట్‌పల్లి, ఆగస్టు 26 (ఈవార్తలు): కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ డివిజన్ ఎన్‌ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 22ఏ భూముల సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. పట్టా భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చడం ఎంతవరకు సమంజసమని నాయకులు ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. 22ఏ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు అండగా ఉండాలే తప్ప గుదిబండగా మారకూడ దన్నారు. అన్ని ఆధారాలు ఉన్న భూములను 22ఏలో చేర్చడం ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని, నిర్ణయం మారే వరకు ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబీహా గౌసుద్దీన్, పగడాల శిరీషా బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి

కూకట్‌పల్లి, ఆగస్టు 26 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా మిగిలిపోయిన 61 ఏళ్ల వీఆర్ఏల 3,797 మంది వారసులకు ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ వారసుల జేఏసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధులు అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావును కలిసి సమస్యను వివరించారు. గత ప్రభుత్వం 81, 85 జీవోలు జారీ చేసి మూడేళ్లు గడిచినా వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హరీశ్‌రావు స్పందిస్తూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సమస్యను సభ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే జేఏసీ చేపట్టే ధర్నాల్లో పాల్గొని, వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, హరీశ్, సంగమేశ్వర్, భరత్, రవిసాగర్, యాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## మల్యాలలో రామాలయానికి భూమిపూజ

మల్యాల, ఆగస్టు 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని ధర్మగిరిలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, పూర్ణకుంభ స్వాగతాల నడుమ ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు పూర్తి సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మల్యాల సర్పంచ్ బోట్ల జయప్రసాద్, వార్డు సభ్యులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, వేదపండితులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 2 నుంచి పద్య పఠన పోటీలు

జగిత్యాల, ఆగస్టు 26 (ఈవార్తలు): తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషా ఫోరం జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో పద్య పఠన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు శేషగిరి, ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. తెలుగు భాషకు ఆయువుపట్టు పద్యమని, భాషకు సొగసు తెచ్చేది పద్యమని భావించి విద్యార్థుల్లో పద్యంపై మక్కువ పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6, 7వ తరగతి విద్యార్థులకు జూనియర్స్, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సీనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. సెప్టెంబర్ 2న మండల స్థాయిలో, సెప్టెంబర్ 8న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.



## ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీలు ఏకగ్రీవం

గంగాధర, ఆగస్టు 26 (ఈవార్తలు): మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి చిలుముల రాజయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ నాయకుడు రుద్రారం రామచంద్ర మాదిగ పాల్గొన్నారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా కల్లేపల్లి గంగసాగర్ మాదిగ, అధికార ప్రతినిధిగా గుంటుకు మహేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా మానువాడ శంకర్‌బాబు, పొత్తూరి విజయ్ మాదిగ ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా గంగాధర రఘు, ప్రధాన కార్యదర్శిగా దోమకొండ అనిల్, కోశాధికారిగా అస్తపురం వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 9న నిర్వహించనున్న 'చలో వరంగల్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# చిన్ని గుండెకు సంజయ్ అండ

**పేదింటి బిడ్డ ఆపరేషన్‌కు చేయూత**



కోరుట్ల, ఆగస్టు 26 (ఈవార్తలు): ఆపదలో ఉన్న ఓ పేద కుటుంబానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అండగా నిలిచారు. గుండెకు రంధ్రం ఏర్పడిన చిన్నారి శివానికి ఆపరేషన్ అవసరమని తెలుసుకున్న ఎమ్మెల్యే మానవతా దృక్పథంతో స్పందించి చికిత్సకు సహకరించారు. దీంతో శివాని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన పిట్ల రజిత భర్త లేకపోవడంతో రోజు కూలీ పనులు చేసుకుంటూ కుమార్తె శివానిని పెంచి పోషిస్తోంది. ఇటీవల శివానికి ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా గుండెకు రంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. చిన్నారికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. ఆపరేషన్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో సహాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌ను సంప్రదించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి సిద్ధిపేట సత్యసాయి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. చిన్నారి శివానికి అవసరమైన గుండె ఆపరేషన్ చేయించి కుటుంబానికి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకుని, చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించిన ఎమ్మెల్యే సంజయ్‌కు పిట్ల రజిత, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చూపిన మానవతా దృక్పథాన్ని వారు అభినందించారు.



## బీడీ కార్మికుల మహాసభల్లో ముక్రమ్‌కు కీలక బాధ్యత

కోరుట్ల, ఆగస్టు 26 (ఈవార్తలు): కోరుట్లకు చెందిన ఎం.డి. ముక్రమ్‌కు బీడీ కార్మికుల జాతీయ స్థాయిలో కీలక బాధ్యత దక్కింది. బీహార్‌లోని సమస్తీపూర్ జిల్లా దర్భన్ సారాయిలో ఆగస్టు 23, 24 తేదీల్లో జరిగిన ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ 13వ జాతీయ మహాసభల్లో ఆయన జాతీయ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముక్రమ్ మాట్లాడుతూ తెలంగాణ బీడీ కార్మికుల సమస్యలను జాతీయ స్థాయిలో బలంగా వినిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనను ఎన్నుకున్న నాయకత్వానికి, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎన్నికపై తెలంగాణ బీడీ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## భజన మందిరం ప్రారంభం

**ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్**

**రూ.10 లక్షల టీటీడీ నిధులతో నిర్మాణం**

జగిత్యాల టౌన్, ఆగస్టు 26 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం 12వ వార్డు ధరూర్ క్యాంప్‌లోని శ్రీ కోదండ రామాలయంలో టీటీడీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన భజన మందిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజా సేవను భగవంతుని సేవగా భావిస్తానన్నారు. పట్టణంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మన ధర్మం, సంస్కృతిని కాపాడుకుంటూనే ఇతర మతాలను గౌరవించాలని సూచించారు. ఆలయాల్లో సాధారణ భక్తులకు ప్రాధాన్యత కల్పించడం కమిటీల బాధ్యత అన్నారు. దైవారాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, 'సర్వేజన సుఖినోభవంతు' అనేది హిందూ ధర్మ సారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్యప్రణవ్, డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, కేడీసీసీ జిల్లా సభ్యుడు ముప్పాళ్ల రాంచందర్‌రావు, కౌన్సిలర్ ప్రశాంత్‌రావు, కోఆప్షన్ సభ్యుడు గట్టు సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ హరీష్, కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు బ్లాంకెట్ల పంపిణీ

జగిత్యాల, ఆగస్టు 26 (ఈవార్తలు): జగిత్యాలలో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం పేదలు, నిరుపేదలకు బ్లాంకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ ఉద్దీన్ తెలిపారు. జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఆయన ఆధ్వర్యంలో పేదలకు



బ్లాంకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి జగిత్యాల సీఐ కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరై బ్లాంకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ ఉద్దీన్ మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ సందేశమైన మానవత్వం, సేవాభావాన్ని ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు తమ వంతు సహకారం అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. పేదలు, నిరుపేదలకు అండగా నిలిచే సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేసిన ముజీబ్ ఉద్దీన్‌ను పలువురు అభినందించారు.



## వెంటనే దళిత బంధు నిధులు విడుదల చేయాలి: కొగిల మహేశ్

ధర్మపురి, ఆగస్టు 26 (ఈవార్తలు): పెండింగ్‌లో ఉన్న రెండో విడత దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొగిల మహేష్ డిమాండ్ చేశారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో దళిత బంధు ఆత్మగౌరవ సభ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వానికి పిండప్రదానం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ దళితుల ఆర్థికాభివృద్ధి, ఆత్మగౌరవం కోసం రూపొందించిన దళిత బంధు పథకం కింద గతంలో ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రతి పేద దళిత కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అన్నారు. దళిత బంధు కోసం ఎంపికైన కుటుంబాలకు నిధులు అందించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. దళితుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ధర్మపురి నుంచే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నెల రోజుల్లోగా దళిత బంధు నిధుల విడుదల, అంబేడ్కర్ అభయహస్తం అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వానికి పిండప్రదానం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భువనగిరి శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారులు, కార్యదర్శులు, జిల్లా కోఆర్డినేటర్ శంకర్, నాయకులు రమేష్, ఓంకార్, పానుగంటి తిరుజాని, మహంకాళి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## మోరీ బిళ్ల వేయండి సార్లు!

వేములవాడ అర్బన్, ఆగస్టు 26 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయం నుంచి పోచమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో మూలమలుపు వద్ద ఉన్న మోరీ గుంతను మూసివేయాలని పట్టణ ప్రజలు, భక్తులు కోరుతున్నారు. కొన్నేళ్ల క్రితం మోరీ మరమ్మతుల కోసం బిళ్లను తొలగించినప్పటికీ, ఇప్పటివరకు తిరిగి కప్పు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం భక్తులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మోరీ బిళ్ల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



## సిగ్నస్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో బండి రమేష్

కూకట్‌పల్లి, ఆగస్టు 26 (ఈవార్తలు): నిజాంపేట్ క్రాస్‌రోడ్డు, సర్దార్‌పటేల్ నగర్‌లో ఏర్పాటు చేసిన సిగ్నస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, మాకినేని వినోద్, శ్రీనివాస్‌బాబు, సత్యనారాయణ, గాదె శివ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

వేములవాడ అర్బన్, ఆగస్టు 26 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. తిప్పాపూర్ బ్రిడ్జి వద్ద ప్రారంభమైన ర్యాలీ రెండో బైపాస్ రోడ్డు, సుభాష్‌నగర్, విశాల షాపింగ్ మీదుగా కోరుట్ల బస్టాండ్ వరకు ఉత్సాహంగా సాగింది. ప్రవక్త చూపిన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని మతపెద్దలు కోరారు. వేములవాడ గంగా-జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రమ్ అన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు పీర్ మహమ్మద్, మసీదు కమిటీ సభ్యులు, మతపెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు


కూకట్‌పల్లి, ఆగస్టు 26 (ఈవార్తలు): ఈద్ ఎ మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఎన్టీఆర్ నగర్, కేటీఆర్ నగర్ కాలనీలలోని దర్గాలను సందర్శించారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## చాపర్తి కుమార్ గాడ్గేకు సన్మానం

హైదరాబాద్, ఆగస్టు 26 (ఈవార్తలు): బీపీ మండల్ జయంతి సందర్భంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం 17 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ఉద్యమకారుడు చాపర్తి కుమార్ గాడ్గేను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య సన్మానించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం 2024 ఆగస్టులో జక్కని సంజయ్ నేత, బత్తుల సిద్ధేశ్వర్, చాపర్తి కుమార్ గాడ్గేలు 17 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గాడ్గేను ఆర్. కృష్ణయ్య శాలువాతో సన్మానించారు. బీసీల రాజకీయ అధికార సాధన కోసం గాడ్గే నిరంతరం ప్రజాక్షేత్రంలో పోరాడుతున్నారని కృష్ణయ్య కొనియాడారు. బీసీలు సంఘటితమై రాజ్యాధికారం కోసం ఓటుతో పోరాడాలని పిలుపునిచ్చారు. గత మార్చిలో బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం 450 కిలోమీటర్ల పాదయాత్ర, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 నియోజకవర్గాల పరిధిలో సైకిల్ యాత్ర చేపట్టినట్లు గాడ్గే తెలిపారు. కార్యక్రమంలో సంచార జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల వీరన్న, బీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మోతె చెరువులో మొసలి

జగిత్యాల టౌన్, ఆగస్టు 26 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని మోతె చెరువులో మొసలి కనిపించడంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. చెరువు ఒడ్డుపై మొసలి సంచరిస్తుండటాన్ని గమనించిన ప్రజలు అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా సమీప ప్రాంతాల నుంచి మొసలి చెరువులోకి వచ్చి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. జనావాసాల మధ్య ఉన్న చెరువులో మొసలి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి దానిని పట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.



# స్టాక్ మార్కెట్ డౌన్



ముంబై: అంతర్జాతీయ పరిణామాలపై మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, ఆటో షేర్లలో అమ్మకాలతో సూచీలపై ఒత్తిడి పెరిగింది. సెన్సెక్స్ 183.15 పాయింట్లు నష్టపోయి 77,472.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.80 పాయింట్లు తగ్గి 24,207.75 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి 24,400 స్థాయి కీలక నిరోధంగా ఉందని నిపుణులు తెలిపారు. ఈ స్థాయిని నిలకడగా దాటితే 24,500-24,600 వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. అప్పటివరకు పైస్థాయుల్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెప్పారు. 24,200 వద్ద నిఫ్టీకి తక్షణ మద్దతు ఉ ందని పేర్కొన్నారు. 24,100-24,000 ప్రాంతం బలమైన మద్దతుగా ఉంటుందని తెలిపారు. 24,150 కంటే దిగువకు నిఫ్టీ బలంగా పడిపోతే అమ్మకాలు మరింత పెరిగి 24,000 స్థాయికి చేరే అవకాశం ఉందన్నారు. నిఫ్టీ షేర్లలో భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్ నష్టాల్లో నిలిచాయి. రంగాల వారీగా ఐటీ సూచీ అత్యధికంగా పడిపోయింది. ఎఫ్‌ఎంసీజీ, ఆటో, రియల్టీ రంగాలు కూడా వెనుకంజ వేశాయి. మరోవైపు మెటల్, ప్రైవేట్ బ్యాంక్, సిమెంట్ సూచీలు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.1 శాతం తగ్గగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.81 శాతం లాభపడింది.

# డెలాయిట్‌కు షాక్

## అమెరికా కేసులో రూ.180 కోట్ల సెటిల్‌మెంట్!





వాషింగ్టన్: అమెరికాకు చెందిన ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్ ఓ కేసు సెటిల్ మెంట్ కింద భారీ మొత్తాన్ని చెల్లించేందుకు అంగీకరించింది. ఉద్యోగ నియామకాల్లో జాతి, లింగాన్ని పరిగణనలోకి తీసుకున్నారన్న ఆరోపణలపై అమెరికా ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తును ముగించేందుకు 21.5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.180 కోట్లు) చెల్లించనుంది. అయితే తాము ఎలాంటి తప్పు చేయలేదని డెలాయిట్ స్పష్టం చేసింది. అమెరికా న్యాయశాఖ (డీఓజే) ఆరోపణల ప్రకారం.. సంస్థలో ఉ ద్యోగుల జాతి, లింగ నిష్పత్తికి సంబంధించి అంతర్గత లక్ష్యాలు ఉండేవి. నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల కేటాయింపుల్లో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విభాగాల పురోగతిని ఈ లక్ష్యాలతో పోల్చి ఉ న్నతాధికారులకు సమాచారం ఇచ్చేవారని తెలిపింది. దాదాపు రెండేళ్లపాటు 150 మంది సీనియర్ పార్ట్‌నర్లు, ప్రిన్సిపల్స్, మేనేజింగ్ డైరెక్టర్ల పనితీరు ఆధారిత చెల్లింపులపై కూడా ఈ లక్ష్యాల ప్రభావం ఉండొచ్చని డీఓజే ఆరోపించింది. స్ప్రింగ్‌బోర్డ్, కంపాస్ వంటి కార్యక్రమాల్లోనూ జాతి, లింగం ఆధారంగా అర్హతలు పరిమితం చేసినట్లు పేర్కొంది. డెలాయిట్ మాత్రం ఆరోపణలను అంగీకరించలేదు. సుదీర్ఘ న్యాయపోరాటంతో వచ్చే ఖర్చు, అనిశ్చితి, సంస్థకు కలిగే అంతరాయాన్ని నివారించేందుకే సెటిల్‌మెంట్‌కు అంగీకరించినట్లు తెలిపింది. ఈ ఒప్పందం తమ తప్పును అంగీకరించినట్లు కాదని స్పష్టం చేసింది.

# వందేమాతరం రెండే చరణాలు పాడుతాం: డీకే



బెంగళూరు: కర్ణాటకలో ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' పూర్తి గేయాన్ని ఆలపించబోమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు ఆలపించడంపై ప్రశ్నించగా.. తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలు మాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లు పేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమానిస్తున్నారని విమర్శించింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది. ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్ చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది. కర్ణాటకలోనూ ఇదే నిర్ణయం అమలవుతుందని శివకుమార్ స్పష్టం చేశారు.




# తెలియనివాళ్ల కాల్స్‌పై పూర్తి ఇన్ఫో

## వాట్సాప్‌లో కొత్త భద్రతా ఫీచర్లు

న్యూఢిల్లీ: ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ భద్రతా ఫీచర్లను మరింత బలోపేతం చేసింది. ఒకే ఖాతాకు ఒకటి కంటే ఎక్కువ పాస్‌కీలు జోడించే అవకాశం కల్పించింది. టూ-స్టెప్ వెరిఫికేషన్‌లో పూర్తి పాస్‌వర్డ్‌ను పెట్టుకునే సదుపాయాన్ని కూడా తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్ వినియోగదారుల కోసం గుర్తుతెలియని కాల్స్‌కు అదనపు వివరాలు చూపించే కొత్త కాల్ స్క్రీనింగ్ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. పాస్‌కీ ఫీచర్‌ను ఇప్పటికే 100 కోట్ల మందికిపైగా వినియోగదారులు ఉ పయోగిస్తున్నట్లు వాట్సాప్ తెలిపింది. ఫింగర్‌ప్రింట్, ఫేస్ ఐడీ లేదా ఫోన్ స్క్రీన్ లాక్ ద్వారా ఖాతాలోకి లాగిన్ కావచ్చు. ఇకపై ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాల్లో ఒకే వాట్సాప్ ఖాతా వాడుతున్న వారు ఒక్కో పరికరానికి వేర్వేరు పాస్‌కీలను జోడించుకోవచ్చు. టూ-స్టెప్ వెరిఫికేషన్‌లోనూ కీలక మార్పు చేశారు. ఇప్పటివరకు ఆరు అంకెల పిన్ మాత్రమే పెట్టుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు అక్షరాలు, అంకెలు, ప్రత్యేక గుర్తులతో కూడిన పొడవైన పాస్‌వర్డ్‌ను కూడా సెట్ చేసుకోవచ్చు. దీంతో ఖాతా భద్రత మరింత పెరుగుతుందని కంపెనీ భావిస్తోంది. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌పై కూడా కొత్త సమాచారం కనిపించనుంది. ముఖ్యంగా ఆండ్రాయిడ్ వినియోగదారులకు కాల్ వచ్చిన దేశం, ఆ వ్యక్తితో కామన్ గ్రూప్ ఉందా లేదా వంటి వివరాలు చూపిస్తుంది. ఈ సమాచారం చూసి కాల్ ఎత్తాలా? వద్దా? అనేది వినియోగదారులు నిర్ణయించుకోవచ్చు. మోసపూరిత కాల్స్‌ను అడ్డుకోవడంలో ఇది ఉపయోగపడుతుందని వాట్సాప్ తెలిపింది.

# ఇమ్రాన్ బతకడం కష్టమే

### కుటుంబ సభ్యులు

పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జైలులో ఏకాంత నిర్బంధంలో ఉన్న తమ తండ్రికి సరైన వైద్యం అందకపోతే ఆయన ప్రాణాలకే ప్రమాదం జరగవచ్చని హెచ్చరించారు. మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇమ్రాన్ కుమారులు ఖాసిం, సులేమాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ పరిస్థితుల్లో ఆయన జైలు నుంచి ప్రాణాలతో బయటపడటం కష్టంగానే కనిపిస్తోంది" అని ఖాసిం వ్యాఖ్యానించారు. ఇమ్రాన్ ఖాన్ అంతర్జాతీయ న్యాయవాది జేర్డ్ గెన్సర్ ఈ పరిస్థితిని "స్లో-మోషన్ హత్య"గా అభివర్ణించారు. గత మూడేళ్లుగా తన తండ్రి ఏకాంత నిర్బంధంలో ఉన్నారని, కిటికీలు లేని 6ఇ8 అడుగుల గదిలో రోజుకు 23 గంటలకు పైగా బంధిస్తున్నారని కాసిం ఆరోపించారు. సరైన వైద్యం అందకపోవడం వల్లే ఆయన కుడి కంటి చూపును దాదాపుగా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశించినా ఇమ్రాన్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించకుండా, ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ఫిట్‌గా ఉన్నారని ప్రకటించడాన్ని వారు తప్పుబట్టారు. గత ఆరు నెలలుగా తమ తండ్రితో ఒక్కసారి కూడా మాట్లాడలేదని, ఇది స్పష్టంగా మానవ హక్కుల ఉల్లంఘనేనని మరో కుమారుడు సులేమాన్ అన్నారు. తన తండ్రి నిర్బంధం, చిత్రహింసల వెనుక పాకిస్థాన్ సైనిక యంత్రాంగం హస్తం ఉందని ఆయన ఆరోపించారు. ఇమ్రాన్‌కు వైద్యం అందించాలని కోరుతూ 21 మంది మాజీ అంతర్జాతీయ క్రికెట్ కెప్టెన్లు పాక్ ప్రధానికి లేఖ రాసిన విషయాన్ని సులేమాన్ గుర్తుచేశారు. మరోవైపు, ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై పాక్ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై సెప్టెంబర్ 16న విచారణ జరగనుంది.

# పిల్లల్ని కంటే రూ. 55 లక్షలు

### సింగపూర్ సంచలన ప్యాకేజీ

సింగపూర్: ఆర్థిక అద్భుతాలకు, ఆధునిక జీవనశైలికి చిరునామాగా నిలిచే సింగపూర్, ఇప్పుడు ఓ తీవ్రమైన సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో జననాల రేటు రికార్డు స్థాయిలో పడిపోవడంతో, ప్రభుత్వం రంగంలోకి దిగింది. పిల్లల్ని కనేందుకు యువతను ప్రోత్సహించే లక్ష్యంతో మునుపెన్నడూ లేని విధంగా ఓ భారీ కుటుంబ మద్దతు ప్యాకేజీని ప్రకటించింది. ఈ పథకం కింద, సింగపూర్‌లో పుట్టిన ప్రతి బిడ్డకు 17 ఏళ్లు నిండే వరకు దాదాపు 70,000 సింగపూర్ డాలర్లు (సుమారు రూ. 55 లక్షలు) ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందనుంది. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ జాతీయ దినోత్సవ ర్యాలీలో ఈ ప్రకటన చేశారు. దేశంలో సంతానోత్పత్తి రేటు 0.87తో అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# సేల్స్ నేర్చుకుంటేనే వ్యాపారంలో సక్సెస్

## జోహో శ్రీధర్ వేంబు సింపుల్ మంత్ర

చెన్నై: వ్యాపారం చేయాలనుకునే ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, వైద్యులకు జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వేంబు ఓ సలహా ఇచ్చారు. "అమ్మడం నేర్చుకోండి" అని సూచించారు. ఉత్పత్తి ఎంత గొప్పగా ఉన్నా.. దాన్ని కస్టమర్లకు నమ్మకంగా వివరించి కొనిపించగలగడం వ్యాపారంలో కీలకమని చెప్పారు. ఇటీవల 'ఎక్స్'లో చేసిన పోస్టులో వేంబు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వ్యాపారంలోకి రావాలనుకునే వారు ఎక్కువగా సేల్స్ కాల్స్‌లో పాల్గొనాలని సూచించారు. తిరస్కరణ ఎదురైనా వెనక్కి తగ్గకుండా ప్రయత్నించాలని చెప్పారు. సేల్స్ చేసే సమయంలో ఎదురయ్యే అనుభవాలు ఎంతో నేర్పుతాయని వేంబు అన్నారు. తమ ఆలోచన ఎంత మంచిదైనా.. దాన్ని ఇతరులకు అర్థమయ్యేలా చెప్పడం అంత సులభం కాదని అప్పుడే తెలుస్తుందని పేర్కొన్నారు. దీనివల్ల కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగవుతాయని చెప్పారు. సేల్స్ అనుభవం ఉన్నప్పుడే ఆ విభాగంలో పనిచేసే వారి కష్టం కూడా అర్థమవుతుందని వేంబు తెలిపారు. వ్యాపారంలో అమ్మకాలు లేకుండా ముందుకు సాగడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఆయన సూచనకు పలువురు నెటిజన్లు తమ అనుభవాలను పంచుకున్నారు.

# ఆరెస్సెస్ చీఫ్ సభకు మద్దతివ్వను

### న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మామ్దాని



న్యూయార్క్: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమంపై వివాదం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని రద్దు చేసే అధికారం నగర పాలక సంస్థకు లేకపోవచ్చని న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మామ్దాని స్పష్టం చేశారు. అయితే, వ్యక్తిగతంగా తాను ఇలాంటి సభలకు మద్దతు ఇవ్వనని ఆయన తేల్చిచెప్పారు. "ఈ ర్యాలీకి నేను మద్దతు ఇవ్వను. కానీ ఒక ప్రైవేట్ కార్యక్రమాన్ని రద్దు చేసే అధికారం నగరానికి ఉందో లేదో నాకు తెలియదు" అని మామ్దాని అన్నారు. తాను భారతీయ అమెరికన్‌గా, తన కుటుంబం నుంచి నేర్చుకున్న భారతదేశ స్ఫూర్తి బహుళత్వంతో, లౌకికవాదంతో కూడుకున్నదని గుర్తుచేశారు. "ఏ దేశంలోనైనా విభజనవాద దృష్టితో పనిచేసే ఉద్యమాలను చూడటం ఆందోళనకరంగా ఉంది. అటువంటి వాటిని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తాను" అని ఆయన స్పష్టం చేశారు. ఆగస్టు 29న జరగనున్న ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలని కోరుతూ 61 పౌర హక్కులు, విశ్వాస, సామాజిక, ఉద్యమ సంస్థల కూటమి మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌పై ఒత్తిడి తెస్తోంది. న్యూయార్క్ నగర హాల్ వెలుపల జరిగిన నిరసన కార్యక్రమంలో డెమోక్రటిక్ పార్టీ నేత బ్రాడ్ లాండర్, సిటీ కౌన్సిల్ సభ్యురాలు షహానా హనీఫ్, వివిధ హిందూ, ముస్లిం, సిక్కు, దళిత్, క్రిస్టియన్ కమ్యూనిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### మామ్దానిపై అమెరికన్ సింగర్ ఫైర్

మోహన్ భగవత్ సభను న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ వ్యతిరేకించడంపై అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్ తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీపై ఉన్న రాజకీయ వ్యతిరేకతతోనే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించిన మేరీ మిల్బెన్, "మేయర్ మమ్దానీ వంటి సోషలిస్టులు భారత ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీని వ్యతిరేకిస్తున్నందునే ఈ సభను అడ్డుకుంటున్నారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ఒక ప్రైవేట్ సంస్థ. అది సోషలిస్టుల అభీష్టానుసారం కాకుండా పెట్టుబడిదారీ విధానంలో నడుస్తుంది. కాబట్టి ఈ కార్యక్రమం జరిగి తీరుతుంది" అని స్పష్టం చేశారు. "మీరు కూడా పెట్టుబడిదారులుగా ఎదిగి, నిధులు సమకూర్చుకుని, మాడిసన్ స్క్వేర్‌ను అద్దెకు తీసుకుని మీ మోదీ వ్యతిరేక ర్యాలీలు నిర్వహించుకోండి" అని ఆమె చురక అంటించారు.

# పాకిస్థాన్ రాజ్యాంగం చచ్చిన గుర్రం

### అల్లా నజర్ బలోచ్

ముజఫరాబాద్: బలూచిస్థాన్ విముక్తి పోరాటంలో రాయితీలు, మధ్యేమార్గాలకు తావులేదని, సార్వభౌమ, స్వతంత్ర బలూచిస్థాన్ ఏర్పాటు చేయడమే తమ ఏకైక లక్ష్యమని బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (దీూఖీ) అధినేత అల్లా నజర్ బలోచ్ మరోసారి స్పష్టం చేశారు. ఇదే తమకు ఆమోదయోగ్యమైన ఏకైక పరిష్కారమని ఆయన తేల్చిచెప్పారు. 'ది సండే గార్డియన్' పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్లు 'ది బలోచిస్తాన్ పోస్ట్' కథనం వెల్లడించింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ రాజ్యాంగాన్ని ఆయన 'చచ్చిన గుర్రం'తో పోల్చారు. సైన్యం, న్యాయవ్యవస్థ, పార్లమెంట్, కార్యనిర్వాహక వర్గాల నుంచి తనను తాను కాపాడుకోలేని నిస్సహాయ స్థితిలో పాక్ రాజ్యాంగం ఉందని ఆయన విమర్శించారు. రాజకీయ స్వయంప్రతిపత్తి, వనరుల ఆదాయంలో అధిక వాటా, బలవంతపు అదృశ్యాలకు ముగింపు వంటి హామీలిస్తే పాకిస్థాన్‌తో చర్చలు జరుపుతారా అని అడగ్గా, ఆయన ఒకే ఒక్క షరతు విధించారు. "చర్చలు జరగాలంటే అది కేవలం అంతర్జాతీయ శక్తుల పర్యవేక్షణలో మాత్రమే సాధ్యం. బలూచిస్థాన్ నుంచి పాకిస్థాన్ సైన్యం సురక్షితంగా వెనుదిరిగి వెళ్లే మార్గాన్ని కల్పించడం కోసమే ఆ చర్చలు ఉంటాయి," అని అల్లా నజర్ పేర్కొన్నారు. బలోచ్ ప్రజలపై పాకిస్థాన్ సైన్యం యుద్ధ విమానాలతో దాడులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.





వయ్యారి చిత్రం




## రాపో 23.. ఏక-ది లోన్ వోల్ఫ్

టాలీవుడ్ ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని ఇక డైరెక్టర్‌గా తన లక్‌ను పరీక్షించుకోబోతున్నాడని తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్నఈ మూవీ =ూౄాా23 వర్కింగ్ టైటిల్‌తో రాబోతుంది. పాపులర్ కంపోజర్ శ్యామ్ సీఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేయబోతున్నాడని ఇప్పటికే ఓ వార్త తెరపైకి వచ్చిందని తెలిసిందే. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ స్పెషల్ గ్లింప్స్ కూడా విడుదల చేశారు. కాగా ఇప్పుడు మరో ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట రౌండప్ చేస్తోంది. ఇంతకీ అదేంటనే కదా మీ డౌటు. ఇంతకీ రామ్ ఎలాంటి టైటిల్‌ను ఫిక్స్ చేస్తాడని అంతా అనుకుంటుండగా.. ఈ చిత్రానికి ఏక- ది లోన్ వోల్ఫ్ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఒకవేళ ఇదేనిజమైతే ఈ టైటిల్ రామ్ మ్యానరిజానికి పక్కాగా సూటవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. టైటిల్‌పై రామ్ టీం ఏదైనా అధికారిక ప్రకటన ఇస్తుందేమో చూడాలి మరి. ఈ చిత్రాన్ని =ూౄశీ సినిమాటిక్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు తిరు సినిమాటోగ్రఫర్ కాగా.. పీటర్ హెయిన్స్ యాక్షన్ కొరియోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు. లవర్ బాయ్‌గా, యాక్షన్ హీరోగా కనిపించిన రామ్ ఇక డైరెక్టర్ కమ్ యాక్టర్‌గా తెరకెక్కిస్తున్న తాజా సినిమాపై అంచనాలు భారీగానే నెలకొన్నాయి.



## 'టాక్సిక్' దూకుడు

యశ్ నటించిన 'టాక్సిక్'కు ఆరంభంలో ఎదురైన విమర్శలు, ఆన్‌లైన్ ట్రోలింగ్ బుధవారం బాక్సాఫీసు ప్రభంజనానికి ఏమాత్రం అడ్డుకాలేదు. ఉదయం నుంచే సినిమా థియేటర్ల వద్ద సందడి కనిపించింది. మధ్యాహ్నానికి ముందే రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' తొలిరోజు భారత్‌లో నెట్ వసూళ్లను 'టాక్సిక్' దాటేసింది. ఓనం సెలవును టార్గెట్ చేస్తూ 'టాక్సిక్' ప్రేక్షకుల ముందుకొచ్చింది. సినిమా హింస, రొమాంటిక్ సన్నివేశాలపై విడుదలకు ముందు చర్చ జరిగినా ప్రేక్షకుల స్పందన మాత్రం బలంగా కనిపించింది. ఉదయం షోలకే పలు ప్రాంతాల్లో థియేటర్లు కళకళలాడాయి. 'సాక్‌నిల్క్' లెక్కల ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.40 గంటలకు 'టాక్సిక్' ఇండియా నెట్ వసూళ్లు రూ.31.76 కోట్లకు చేరాయి. 9,003 షోల ద్వారా ఈ మొత్తం వచ్చింది. ఇండియా గ్రాస్ రూ.37.48 కోట్లుగా నమోదైంది. కన్నడ 2డీ వెర్షన్ 77.69 శాతం ఆక్యుపెన్సీతో ముందుంది. తెలుగు వెర్షన్ 57.08 శాతం, తమిళం 45.25 శాతం, మలయాళం 40.13 శాతం, హిందీ 37.85 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి. రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' తొలిరోజు ఇండియాలో రూ.28.60 కోట్ల నెట్, రూ.33.60 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. 'టాక్సిక్' ఉదయం షోలతోనే ఆ మార్కును అధిగమించింది. యశ్ 'కేజీఎఫ్: చాప్టర్ 2' తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.100-120 కోట్ల వసూళ్లు సాధించొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆ స్థాయికి చేరితే అతిపెద్ద ఇండియన్ ఓపెనర్లలో ఒకటిగా నిలుస్తుంది. రూ.100 కోట్ల మార్కును దాటితే 'కేజీఎఫ్: చాప్టర్ 2' తర్వాత ఆ ఘనత సాధించిన రెండో కన్నడ చిత్రంగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 12 వేలకుపైగా స్క్రీన్లలో సినిమా విడుదలైంది. విడుదలకు ముందే కోటి టికెట్లకు పైగా అమ్ముడయ్యాయి. ఇండియాలో బ్లాక్ సీట్లు మినహాయించి అడ్వాన్స్ బుకింగ్స్ రూ.58.27 కోట్లకు చేరాయి. బ్లాక్ సీట్లతో కలిపి ఈ మొత్తం రూ.73.43 కోట్లుగా నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా ప్రీ-సేల్స్ దాదాపు రూ.85 కోట్లకు చేరాయి.

## ఎల్లుండి కింగ్ 100 గ్లింప్స్



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం ప్రస్తుతం సినీ వర్గాల్లో భారీ చర్చకు దారితీస్తోంది. తాత్కాలికంగా 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు తమిళ దర్శకుడు రా. కార్తిక్ దర్శకత్వం వహిస్తున్నారు. నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజా సమాచారం ప్రకారం నాగార్జున పుట్టినరోజును పురస్కరించుకుని ఆగస్టు 29న 'కింగ్ 100' ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ గ్లింప్స్‌తో పాటు సినిమా అసలు టైటిల్‌ను కూడా ప్రకటించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, సినిమా విడుదల తేదీపై కూడా కీలక ప్రకటన రావచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'కింగ్ 100' ఒక పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నప్పటికీ, కథలో ప్రధానంగా తండ్రీ--కూతుళ్ల మధ్య ఉండే భావోద్వేగ బంధం కీలకంగా ఉండనున్నట్లు సమాచారం. అదే సమయంలో సాధారణ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగే వ్యక్తి ప్రయాణాన్ని చూపించే రాగ్స్ టు రిచెస్ అంశం కూడా కథలో ప్రధాన ఆకర్షణగా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. కమర్షియల్ ఎలిమెంట్స్, కుటుంబ భావోద్వేగాలు, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఒక వ్యక్తి జీవిత ప్రయాణాన్ని మిళితం చేసి దర్శకుడు రా. కార్తిక్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నాగార్జునకు ఇది ఆయన గత చిత్రాలకు భిన్నమైన పాత్రగా నిలవనుందనే అంచనాలు ఉన్నాయి.

## 'అర్జున్ రెడ్డి'కి ఎక్స్‌టెండెడ్ వెర్షన్: సందీప్ రెడ్డి

టాలీవుడ్ చరిత్రలో సంచలనం సృష్టించి కల్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'అర్జున్ రెడ్డి' సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదలై వచ్చే ఏడాది పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, దీనికి



సంబంధించిన ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌ను ప్రేక్షకులకు అందించనున్నట్లు ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రకటించారు. ఇటీవలే జరిగిన 'రోమాంచకం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ వేడుకలో పాల్గొన్న ఆయన ఈ విషయాలను అభిమానులతో పంచుకున్నారు. విజయ్ దేవరకొండ హీరోగా, షాలిని పాండే హీరోయిన్‌గా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కిన 'అర్జున్ రెడ్డి' యువతను విపరీతంగా ఆకట్టుకోవడమే కాకుండా టాలీవుడ్ ట్రెండ్‌ను పూర్తిగా మార్చివేసింది. ఈ సినిమా వచ్చే ఏడాదితో 10 ఏండ్లు పూర్తిచేసుకోనుంది. అయితే ఈ సందర్భంగా థియేటర్లలో రీ-రిలీజ్ చేయాలని తాము ఆలోచిస్తున్నట్లు సందీప్ తెలిపారు. అంతేకాకుండా, కేవలం సాధారణ రీ-రిలీజ్ కాకుండా అభిమానులను అలరించేలా ఒక ప్రత్యేకమైన ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌ను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

## బికినీ-రాఖీ యాడ్ వెనక్కి!

ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'గీవా' ఇటీవల విడుదల చేసిన రక్షాబంధన్ ప్రకటన సోషల్ మీడియాలో తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ నటి కృతిసనన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాడ్ సోషల్ మీడియాలో వైరల్ అయిన వెంటనే,



పలువురు నెటిజన్లు మరియు కొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. హిందూ సంప్రదాయాలను, పవిత్రమైన రక్షాబంధన్ పండుగను తప్పుగా చిత్రీకరించేలా ఈ ప్రకటన ఉందంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. పండుగ పవిత్రతకు భంగం కలిగించేలా యాడ్ కంటెంట్ ఉందంటూ బ్రాండ్‌పై విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో వ్యతిరేకత పెరగడంతో అప్రమత్తమైన 'గీవా' యాజమాన్యం తక్షణమే స్పందించింది. వివాదాస్పదమైన ఆ ప్రకటనను అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, మీడియా మాధ్యమాల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

## దేనికైనా రెడీ

### ప్రియా భవానీ శంకర్

టాలీవుడ్ యంగ్ బ్యూటీ ప్రియా భవానీ శంకర్ ఇటీవల 'ఇరుముడి' చిత్రంతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సినిమాలో మాస్ మహారాజా రవితేజ సరసన భార్యగా, ఒక పాపకు తల్లిగా కనిపించి తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. ఈ సినిమా మంచి విజయం సాధించిన సందర్భంగా, రీసెంట్ ఇంటర్వ్యూలో తన పాత్ర, కెరీర్ నిర్ణయాలపై ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తెరపై ఒక బిడ్డకు తల్లిగా నటించడానికి తనకు ఎటువంటి అభ్యంతరం లేదని ప్రియా భవానీ శంకర్ స్పష్టం చేశారు. ఒకవేళ తనకి ఇరవై ఏళ్ల వయసులోనే వివాహం జరిగి ఉంటే, ఈపాటికి నిజ జీవితంలోనూ ఒక పాప లేదా బాబు ఉండేవారని, అందువల్ల ఇలాంటి పాత్రలు చేయడానికి వెనుకాడాల్సిన అవసరం లేదని అన్నారు. ఒక నటిగా తనకు పాత్ర కంటే కూడా ఆ కథ ఎంత బలంగా ఉందో చూసుకోవడమే ముఖ్యమని చెప్పారు. కాబట్టి కథ నచ్చితే ఏం చేయడానికైనా రెడీగా ఉంటానని స్పష్టం చేశారు.





# నో బాల్స్‌లో జడేజా రికార్డు

టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టుల్లో అత్యంత చెత్త రికార్డును నమోదు చేశాడు. డీఆర్ఎస్ కోరడంలో 22 సార్లు విఫలమై చెత్త రికార్డు మూటగట్టుకున్న జడేజా ఖాతాలో ఇప్పుడు నోబాల్స్ రికార్డు కూడా వచ్చి చేరడం గమనార్హం. 2021 నుంచి ఐదేళ్ల కాలంలో జడేజా అత్యధిక నోబాల్స్ వేసిన స్పిన్నర్‌గా నిలిచాడు. అతని ఖాతాలో ఏకంగా 88 నో-బాల్స్ నమోదయ్యాయి. ఫాస్ట్ బౌలర్లు నోబాల్స్ వేయడం సర్వ సాధారణం. ఎందుకంటే రనప్‌లో తేడా వచ్చిన ప్రతీసారి వాళ్లు నోబాల్స్ వేయడం కనిపిస్తుంది. కానీ స్పిన్నర్లు మాత్రం వీలైనంత తక్కువగానే నోబాల్స్ వేయడం చూస్తుంటాం. కానీ జడేజా విషయంలో మాత్రం సీన్ మొత్తం రివర్స్ అయింది. 2021 నుంచి ఇప్పటివరకు జడేజా 88 నో బాల్స్ వేయడం గణాంకాల పరంగా ఆందోళన కలిగించే అంశం. తాజాగా కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో జడేజా నో-బాల్ వేయడం మరోసారి చర్చనీయాంశమైంది. అంతేకాదు ఇదే టెస్టులో భారత స్పిన్నర్లు ఇప్పటివరకు మొత్తం 10 నో-బాల్స్ వేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2021 నుంచి టెస్టు క్రికెట్ లో స్పిన్నర్లు వేసిన నో-బాల్స్ గణాంకాలను పరిశీలిస్తే జడేజా అందరికంటే ముందున్నాడు. పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ 40 నోబాల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. జడేజా వేసిన నో-బాల్స్ సంఖ్య తన తర్వాతి స్థానంలో ఉన్న బౌలర్‌కు రెట్టింపు సంఖ్యలో ఉండడం గమనార్హం.




# స్టార్క్ నం. 1

ఐసీసీ టెస్టు ర్యాంకులు విడుదలయ్యాయి. బౌలింగ్ విభాగంలో ఇప్పటి వరకూ అగ్రస్థానంలో ఉన్న జస్‌ప్రీత్ బుమ్రా రెండో స్థానానికి చేరాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడని విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో నిప్పులు చెరిగే బౌలింగ్ వేసిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 872 పాయింట్లు ఉన్నాయి. బుమ్రా (862), మ్యాట్ హెన్రీ (861) తర్వాత స్థానాల్లో నిలిచారు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ (807) కూడా ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో ర్యాంక్ అందుకొన్నాడు. బ్యాటింగ్ విభాగంలో భారత ఆటగాళ్లు రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ (35 నుంచి 30వ స్థానం) తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. అయితే, యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. టాప్ -10లో టీమ్ఇండియా నుంచి ఇద్దరు మాత్రమే చోటు దక్కించుకున్నారు. రిషభ్ పంత్ (711) ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరాడు. శుభ్‌మన్ గిల్ (711) ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ (874), జో రూట్ (850), స్టీవ్ స్మిత్ (840), ట్రావిస్ హెడ్ (811), టెంబా బవుమా (775) తొలి ఐదు ర్యాంకుల్లో నిలిచారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా (428)దే అగ్రస్థానం.




# సెప్టెంబర్ 18న బీసీసీఐ ఏజీఎం

భారత క్రికెట్ బోర్డు వార్షిక సర్వసభ్య సమావేశం ముంబయి వేదికగా సెప్టెంబర్ 18న జరగనుంది. బీసీసీఐ ఎన్నికలు కూడా అదే రోజున నిర్వహించనున్నారు. రెండు ప్రధాన అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నట్లు సమాచారం. అలాగే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పనితీరుపై విశ్లేషణ చేస్తుందో లేదో చూడాలి. మరోవైపు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడింగిపుపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బీసీసీఐ ఇప్పటికే సభ్యులకు నోటిఫికేషన్‌ను పంపింది. ఎన్నికల ఓటర్ల జాబితాలో చేర్చాల్సిన తమ ప్రతినిధులను ఎంపిక చేసుకోవాలని సూచించింది. అందుకోసం ఆగస్టు 31 వరకు గడువు ఉంది. ఓటర్ల జాబితా ముసాయిదాను సెప్టెంబర్ 1న రిలీజ్ చేయనుంది. సభ్యులుగా ఎన్నికయ్యేందుకు నామినేషన్లను సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో దాఖలు చేయాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 12న అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతోపాటు ఆ రోజే ఎన్నికలు జరుగుతాయి. సెప్టెంబర్ 18న ఫలితాలు వెల్లడవుతాయి. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిలింగ్‌లోకి కొత్తగా ప్రతినిధులను తీసుకోవడంపై వార్షిక సమావేశంలో బీసీసీఐ నిర్ణయం తీసుకోనుంది.




# విజయానికి చేరువలో... ఇండియా




భారత్, శ్రీలంక మధ్య కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ ఉత్కంఠభరిత దశకు చేరుకుంది. అయితే, కీలకమైన నాలుగో రోజు ఆటలో వర్షం పదేపదే అంతరాయం కలిగించడంతో అంపైర్లు ఆటను ముందుగానే రద్దు చేశారు. ఆట ముగిసే సమయానికి, ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ప్రస్తుతం 16 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉన్నప్పటికీ, మ్యాచ్ పూర్తిగా భారత్ నియంత్రణలో ఉంది.

**రెండో ఇన్నింగ్స్ లో శ్రీలంక 229/6**

**ఆతిథ్య జట్టుకు 16 పరుగుల స్వల్ప ఆధిక్యం**

**వర్షంతో ముందే ముగిసిన నాలుగో రోజు ఆట**

నాలుగో రోజు ఉదయం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను 290 పరుగుల వద్ద ముగించిన భారత్, వెంటనే ఫాలోఆన్ ఇచ్చింది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబరిచారు. ముఖ్యంగా, మరోసారి అద్భుతంగా ఆడిన పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, శ్రీలంకకు మంచి ఆధిక్యం అందించేలా కనిపించారు. వీరి నిలకడతో శ్రీలంక శిబిరంలో ఆశలు చిగురించాయి. అయితే, దూకుడుగా ఆడే క్రమంలో కమిందు మెండిస్ చేసిన ఒక పొరపాటు మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి స్క్వేర్ లెగ్ వద్ద గాల్లోకి బంతిని లేపాడు. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న శుభ్‌మన్ గిల్ వెనక్కి పరుగెత్తుతూ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో శ్రీలంక పతనం ప్రారంభమైంది. ఆ వికెట్ పడిన తర్వాత టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కొద్దిసేపటికే, సెంచరీకి చేరువలో ఉన్న సూరియబండారను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ ధనంజయ డి సిల్వా (23), నిరోషన్ డిక్వెల్లా (6) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. వర్షం కారణంగా ఆట నిలిపివేసే సమయానికి, సోనల్ దినుషా (7), కేశర నువంత (3) క్రీజులో ఉన్నారు. మరో 8 ఓవర్లలో కొత్త బంతి అందుబాటులోకి రానుండటం భారత బౌలర్లకు మరింత అనుకూలించే అంశం. ఐదో రోజు వర్షం ముప్పు ఉన్నప్పటికీ, వాతావరణం అనుకూలిస్తే మ్యాచ్ ఫలితం తేలడం ఖాయం. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే భారత్ మరో 4 వికెట్లు పడగొట్టి, ఆపై లక్ష్యాన్నిఛేదించాల్సి ఉంటుంది. బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్, జడేజా, సారాంశ్ జైన్ తలో వికెట్ సాధించారు.

# జైస్వాల్, వైభవ్‌ను అదుపులో పెట్టల్సిందే

**లేకపోతే మళ్లీ అదే తప్పు చేస్తారు: మంజ్రేకర్**

భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య జరిగిన వివాదంపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ స్పందించారు. ఆటగాళ్ల తప్పిదాలపై తేలికగా వ్యవహరిస్తే.. వారు మళ్లీ అదే ప్రవర్తనకు పాల్పడే అవకాశం ఉ ందని అన్నారు. ఇలాంటి ఘటనలు ఆటకు, ముఖ్యంగా ఆటగాళ్ల భవిష్యత్తుకు మంచిది కాదని పేర్కొన్నారు. కొలంబోలో జరిగిన రెండో టెస్టులో జైస్వాల్ ఔటైన తర్వాత ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తగిలింది. ఘటనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇద్దరు ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఒక్కొక్కరికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. ఈ వ్యవహారంపై మంజ్రేకర్ సోషల్ మీడియాలో స్పందించారు. వైభవ్



సూర్యవంశీ ఘటనను కూడా ప్రస్తావిస్తూ ఐసీసీ, బీసీసీఐను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఆటగాళ్లను ఇలాంటి ప్రవర్తన నుంచి తప్పించుకుంటూ పోతే.. అదే పని మళ్లీ చేసేలా ప్రోత్సహించినట్టవుతుందని అన్నారు. ఇటీవల శ్రీలంక 'ఏ'తో మ్యాచ్ సందర్భంగా 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా వివాదంలో చిక్కుకున్నాడు. శ్రీలంక 'ఏ' ఆటగాడు విషెన్ హలంబగేతో అతడు భౌతిక ఘర్షణకు దిగాడు. అప్పట్లో మంజ్రేకర్ ఈ ఘటనను తీవ్రంగా తప్పుబట్టారు. తాను ఇండియా 'ఏ' మేనేజ్‌మెంట్‌లో ఉంటే తదుపరి మ్యాచ్‌కు వైభవ్‌ను తప్పించేవాడినని చెప్పారు. జైస్వాల్ కూడా తనపై వచ్చిన విమర్శలకు స్పందించాడు.

# అదరగొట్టిన భువీ.. యూపీ లీగ్‌లో లక్నో హవా

యూపీ టీ20 లీగ్ 2026లో లక్నో ఫాల్కన్స్ జోరు కొనసాగుతోంది. భారత సీనియర్ పేసర్, కెప్టెన్ భువనేశ్వర్ కుమార్ తన పదునైన బౌలింగ్‌తో మరోసారి మాయ చేయడంతో డిఫెండింగ్ ఛాంపియన్ కాశీ రుద్రాస్‌పై లక్నో ఫాల్కన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో లక్నోకు ఇది వరుసగా మూడో గెలుపు కావడం విశేషం. రెండు రోజుల వ్యవధిలో కాశీ జట్టుపై లక్నోకి ఇది రెండో విజయం. లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో ఫాల్కన్స్ బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ భువనేశ్వర్ కుమార్ ఆరంభంలోనే అద్భుత స్పెల్‌తో చెలరేగాడు. పవర్‌ప్లేలోనే మూడు కీలక వికెట్లు పడగొట్టి కాశీ రుద్రాస్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. దీంతో కాశీ జట్టు 28 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో శుభమ్ చౌబే (32 బంతుల్లో 46) ఒంటరి పోరాటంతో కాశీ జట్టు కాస్త కోలుకుంది. అయితే, మరో పేసర్ అభినందన్ సింగ్ (3/16) మిడిల్, లోయర్ ఆర్డర్‌ను దెబ్బతీయడంతో కాశీ రుద్రాస్ 19.1 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌట్ అయింది. భువనేశ్వర్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. 127 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో ఫాల్కన్స్‌కు ఓపెనర్ మహమ్మద్ సైఫ్ (8 బంతుల్లో 17) మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, కాశీ బౌలర్ సంగమ్ సింగ్ ఒకే ఓవర్లో సైఫ్‌తో పాటు అజీత్ వర్మ (0)ను పెవిలియన్‌కు పంపి షాకిచ్చాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన



హిమాన్షు సింగ్ (41 బంతుల్లో 64; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడైన అర్ధశతకంతో ఛేదనను నడిపించాడు. జట్టు స్కోరు 109 వద్ద అతను ఔటయ్యేసరికే లక్నో విజయం దాదాపు ఖాయమైంది. మధ్యలో కొద్దిసేపు వర్షం ఆటంకం కలిగించినా, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ప్రియమ్ గార్గ్, కీపర్ కార్తికేయ సింగ్ లాంఛనాన్ని పూర్తి చేశారు. లక్నో ఫాల్కన్స్ 24 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

# స్కూల్ వల్లే నా కెరీర్ నాశనం: ఆసీస్ మాజీ క్రికెటర్

విల్ పుకోవిస్కి.. ఆస్ట్రేలియా తరఫున కేవలం ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడి 27 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 36 మ్యాచులు ఆడాడు. ఇంత త్వరగా అతడు ఆటకు గుడ్‌బై చెప్పడానికి కారణం విపరీతంగా గాయాలు కావడమే. అయితే, ఇలా జరగడానికి మాత్రం తాను చదువుకున్న స్కూలేనని ఆరోపిస్తూ తాజాగా దావా వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టీనేజర్‌గా విల్ 2014లో మెల్‌బోర్న్‌లోని బ్రైటన్ ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఆ సమయంలో ఫుట్‌బాల్ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. అప్పుడు అతడి వయసు 16 ఏళ్లు. తలకు గాయం కాగా.. స్కూల్ యాజమాన్యం మాత్రం సరైన వైద్యం అందించలేదని.. అందుకే తన క్రికెట్ కెరీర్‌లో 13సార్లు కంకషన్ ఎదుర్కోవాల్సి వచ్చిందని విల్ ఆరోపించాడు. దీంతో 2024లో క్రీడలకు వీడ్కోలు చెప్పాలని స్వతంత్ర మెడికల్ ప్యానల్ రికమెండ్ చేసినట్లు గుర్తు చేశాడు.

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# పాక్‌కు పక్కలో బల్లెంలా భారత్-అఫ్ఘన్

భారత్-అఫ్ఘనిస్థాన్ సంబంధాల్లో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ జరిపిన భేటీ ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణాసియా రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో, ఈ సంప్రదింపులు కేవలం దౌత్యపరమైన సమావేశంగా కాకుండా భవిష్యత్ ప్రాంతీయ వ్యూహాలకు కొత్త దిశను సూచిస్తున్నాయి. ఒకప్పుడు చారిత్రక, సాంస్కృతిక, ప్రజా సంబంధాలతో ముడిపడిన ఈ రెండు దేశాల మధ్య బంధం ఇటీవల కాలంలో అఫ్ఘనిస్థాన్ రాజకీయ పరిణామాల కారణంగా సంక్లిష్టంగా మారింది. ఇప్పుడు ఆ సంబంధాలకు మళ్లీ కొత్త ఊపిరి పోయే అవకాశం కనిపిస్తోంది. అఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్ అత్యంత జాగ్రత్తతో వ్యవహరించింది. భద్రతా ప్రయోజనాలు, ఉగ్రవాద ముప్పు, అక్కడ నివసించే ప్రజల సంక్షేమం, భారత పెట్టుబడుల పరిరక్షణ వంటి అంశాలు ఢిల్లీకి కీలకంగా మారాయి. అదే సమయంలో అఫ్ఘన్ ప్రజలతో ఉన్న సుదీర్ఘ స్నేహాన్ని భారత్ పూర్తిగా తెంచుకోలేదు. మానవతా సహాయం, ఆహార ధాన్యాలు, ఔషధాలు, ఇతర అవసరాల ద్వారా తన స్నేహ హస్తాన్ని కొనసాగించింది. ఈ నేపథ్యంలో జైశంకర్ భేటీ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఈ సమావేశం ద్వారా భారత్ ఒక ముఖ్యమైన సందేశం ఇచ్చినట్లే. అఫ్ఘనిస్థాన్‌లో ప్రభుత్వాలు మారినా, అక్కడి ప్రజలతో భారత స్నేహం మారదనే సందేశం ఇది. అయితే సంబంధాల పునరుద్ధరణలో భారత జాతీయ భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం కూడా సహజమే. అఫ్ఘన్ నేల ఏ దేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలకు వేదిక కాకూడదనేది భారత ప్రధాన ఆందోళన. ఈ విషయంలో అఫ్ఘన్ పాలకుల నుంచి స్పష్టమైన హామీలు, ఆచరణాత్మక చర్యలు అవసరం. అఫ్ఘనిస్థాన్‌కు భారత్ కేవలం ఒక పొరుగు దేశం కాదు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ భాగస్వామిగా నిలిచింది. పార్లమెంట్ భవనం నిర్మాణం నుంచి రహదారులు, విద్యుత్, ఆరోగ్యం, విద్య వంటి రంగాల వరకు భారత సహకారం విస్తరించింది. అందువల్ల పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడం ఇరు దేశాలకు ప్రయోజనకరం. ఈ భేటీకి మరో కీలకమైన ప్రాంతీయ కోణం కూడా ఉంది. అఫ్ఘనిస్థాన్‌లో ప్రభావం కోసం పాకిస్థాన్, చైనా వంటి దేశాలు తమదైన వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ అక్కడి పరిణామాలను కేవలం దూరం నుంచి వీక్షించడం సరైన వ్యూహం కాదు. అఫ్ఘనిస్థాన్‌తో ప్రత్యక్ష సంభాషణ కొనసాగించడం ద్వారా భారత్ తన భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవడంతోపాటు మధ్య ఆసియాతో సంబంధాలకు కొత్త మార్గాలను అన్వేషించగలదు. అయితే దౌత్య సంబంధాల బలోపేతం అంటే అఫ్ఘన్ పరిస్థితులపై కళ్లు మూసుకోవడం కాదు. మహిళల హక్కులు, విద్య, మానవ హక్కులు, సమగ్ర పాలన వంటి అంశాలపై భారత్ తన విలువలను స్పష్టంగా వినిపించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా, సంభాషణ మరియు సహకారం ద్వారా మార్పును ప్రోత్సహించే సమతుల్య దౌత్యం అవసరం. జైశంకర్ భేటీ ఈ దిశలో ఒక కీలక అడుగుగా చూడాలి. దౌత్యంలో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రుల కంటే శాశ్వత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందనే వాస్తవాన్ని భారత్ మరోసారి గుర్తుచేసింది. అఫ్ఘనిస్థాన్‌లో స్థిరత్వం ఉంటే దాని ప్రయోజనం దక్షిణాసియాకే కాకుండా మొత్తం మధ్య ఆసియా ప్రాంతానికీ ఉంటుంది. అస్థిర అఫ్ఘనిస్థాన్ ఉగ్రవాదం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, శరణార్థుల సంక్షోభం వంటి సమస్యలకు కారణమవుతుంది. అందుకే భారత్-అఫ్ఘన్ సంబంధాల బలోపేతం కేవలం రెండు దేశాల వ్యవహారం కాదు. ఇది ప్రాంతీయ శాంతి, భద్రత, ఆర్థిక అనుసంధానానికి సంబంధించిన అంశం. జైశంకర్ భేటీ ద్వారా ప్రారంభమైన లేదా బలపడిన ఈ దౌత్య సంభాషణను పరస్పర విశ్వాసం, భద్రతా సహకారం, మానవతా దృక్పథంతో ముందుకు తీసుకెళ్లాలి.

# స్వదేశీ శక్తి..

## స్వావలంబనకు అస్త్రం!

ఒకప్పుడు దేశ రక్షణ అవసరాల కోసం విదేశీ ఆయుధాలపై భారీగా ఆధారపడాల్సిన పరిస్థితి భారత్‌కు ఉండేది. యుద్ధ విమానాల నుంచి క్షిపణి వ్యవస్థల వరకు, రాడార్ల నుంచి అత్యాధునిక సైనిక పరికరాల వరకు విదేశీ కంపెనీల వైపు చూడాల్సి వచ్చేది. దీంతో దేశ భద్రత కోసం ఖర్చు చేసే వేల కోట్ల రూపాయలు విదేశాలకు తరలిపోయేవి. కేవలం ఆయుధాల కొనుగోలుకే పరిమితం కాకుండా, వాటి విడిభాగాలు, మరమ్మతులు, నిర్వహణ, సాంకేతిక సహకారం పేరుతో కూడా విదేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. అవసరమైన సమయంలో విడిభాగాలు అందకపోతే దేశ రక్షణ సామర్థ్యమే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉండేది. అయితే ఇప్పుడు భారత్ ఈ పరిస్థితిని మార్చే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. "స్వదేశీ రక్షణ సామర్థ్యం" అనే లక్ష్యంతో దేశీయంగా ఆయుధాలు, రక్షణ పరికరాలు, కీలక సాంకేతికతలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టడం భవిష్యత్ భారత రక్షణ వ్యవస్థకు అత్యంత కీలకమైన పరిణామం.



ముఖ్యంగా వేల సంఖ్యలో రక్షణ పరికరాలు, విడిభాగాలు, కీలక వ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేసి తయారు చేయాలనే నిర్ణయాలు స్వావలంబనకు బలమైన పునాది వేస్తున్నాయి. ప్రపంచంలో అనేక దేశాల మధ్య జరిగే ఘర్షణల వెనుక కేవలం రాజకీయ విభేదాలు, సరిహద్దు సమస్యలు, జాతి వైరుధ్యాలు మాత్రమే ఉండవు. అంతర్జాతీయ ఆయుధ వ్యాపారం కూడా ఒక పెద్ద వాస్తవం. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగితే ఆయుధాల అవసరం పెరుగుతుంది. ఆయుధాల అవసరం పెరిగితే వాటిని తయారు చేసే దేశాలు, కంపెనీలకు భారీగా లాభాలు వస్తాయి. ఇది ప్రపంచం ఎన్నోసార్లు చూసిన చేదు నిజం. ఒకవైపు శాంతి చర్చల గురించి మాట్లాడుతూనే, మరోవైపు ఆయుధ విక్రయాల ద్వారా భారీ వ్యాపారం సాగించే శక్తివంతమైన దేశాలు ఉన్నాయి. ప్రత్యర్థి దేశాలకు వేర్వేరుగా ఆయుధాలు అమ్మడం, వాటి మధ్య రక్షణ పోటీ పెరగడం వల్ల ఆయుధ మార్కెట్ మరింత విస్తరించడం అంతర్జాతీయ రాజకీయాల్లో కనిపించే వాస్తవం. అయితే ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉంది. ఇతర దేశాలు తయారు చేసిన ఆయుధాలను కొనుగోలు చేస్తూ శాశ్వతంగా ఆధారపడటమే భారత్ భవిష్యత్తా? లేక తన రక్షణ అవసరాలను తానే తీర్చుకునే సామర్థ్యాన్ని పెంచుకోవడమే సరైన మార్గమా?

భారత్ ఇప్పుడు రెండో మార్గాన్ని ఎంచుకుంది. భారత్‌కు అవసరమైన ఆయుధాలను భారత్‌లోనే తయారు చేయడం అంటే కేవలం ఒక రక్షణ విధానం కాదు. అది ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక స్వాతంత్ర్యానికి సంబంధించిన వ్యూహం. విదేశాల నుంచి ఆయుధాలు కొనుగోలు చేయడానికి ఖర్చు చేసే భారీ మొత్తంలో డబ్బు దేశంలోనే ఉంటే, అదే నిధులు దేశీయ పరిశ్రమలకు, పరిశోధనలకు, ఉపాధికి, కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడతాయి. మన రక్షణ అవసరాల కోసం మనమే తయారు చేసుకోవడం అంటే.. మన డబ్బు మన దేశంలోనే తిరుగుతుంది. మన యువతకు ఉద్యోగాలు వస్తాయి. మన శాస్త్రవేత్తలకు పరిశోధన అవకాశాలు పెరుగుతాయి. మన పరిశ్రమలకు ప్రపంచ స్థాయి మార్కెట్ తెరుచుకుంటుంది. ఇది ఒక ఆయుధాన్ని కొనుగోలు చేయడం, తయారు చేయడం మధ్య ఉన్న అసలు తేడా. విదేశాల నుంచి ఆయుధం కొనుగోలు చేస్తే మనకు ఒక ఉత్పత్తి వస్తుంది. కానీ అదే ఆయుధాన్ని దేశీయంగా తయారు చేస్తే మనకు సాంకేతికత, పరిశ్రమ, నైపుణ్యం, ఉపాధి, పరిశోధన, భవిష్యత్ ఆర్థిక సామర్థ్యం అన్నీ కలిసి వస్తాయి.

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ డీఆర్డీవో వంటి సంస్థలు దేశ సాంకేతిక స్వావలంబనకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచ దేశాలకు ఉపగ్రహ ప్రయోగ సేవలు అందించే స్థాయికి చేరుకోవడం వెనుక స్వదేశీ పరిశోధన శక్తి ఉంది. అదే తరహాలో రక్షణ రంగంలో కూడా క్షిపణులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ వ్యవస్థలు, నిఘా సాంకేతికతలు, యుద్ధ సంబంధిత పరికరాల అభివృద్ధిలో భారత్ తన సామర్థ్యాన్ని విస్తరిస్తోంది. ఇప్పుడు ఈ ప్రయాణం ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితం కావడం లేదు. ప్రైవేటు రంగం, స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా రక్షణ ఉత్పత్తి వ్యవస్థలో భాగస్వాములు కావడం అత్యంత కీలకమైన మార్పు. వేల సంఖ్యలో పరికరాలను దేశీయంగా తయారు చేయాలనే నిర్ణయాలు ఈ పరిశ్రమలకు కొత్త అవకాశాలను తెస్తాయి. ఒక యుద్ధ విమానం తయారు చేయాలంటే కేవలం ఒక పెద్ద సంస్థ ఉంటే సరిపోదు. వేలాది చిన్న పరికరాలు, ఎలక్ట్రానిక్ భాగాలు, ప్రత్యేక లోహాలు, సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు, సెన్సార్లు, యంత్ర భాగాలు అవసరం. అంటే రక్షణ రంగ స్వదేశీకరణ అనేది ఒక పరిశ్రమకు కాకుండా మొత్తం దేశ పారిశ్రామిక వ్యవస్థకు ఊపునిస్తుంది. దేశీయంగా వేల సంఖ్యలో రక్షణ పరికరాలు, విడిభాగాలను అభివృద్ధి చేయాలనే నిర్ణయం చిన్న విషయం కాదు. ఎందుకంటే రక్షణ వ్యవస్థలో అత్యంత కీలకమైన సమస్య విడిభాగాలపై విదేశీ ఆధారపడటం. యుద్ధం లేదా అంతర్జాతీయ ఉద్రిక్తతల సమయంలో సరఫరా గొలుసు తెగిపోతే అత్యాధునిక ఆయుధం ఉన్నా అది ఉపయోగపడకపోవచ్చు. స్వదేశీ తయారీ పెరిగితే అవసరమైన సమయంలో అవసరమైన పరికరాన్ని దేశంలోనే తయారు చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. విదేశీ ఆంక్షలు, సరఫరా ఆలస్యం, రాజకీయ ఒత్తిళ్లు దేశ రక్షణ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం తగ్గుతుంది.

రేపు ఏదైనా అంతర్జాతీయ సంక్షోభం వచ్చినప్పుడు ఒక విదేశీ ప్రభుత్వం మనకు విడిభాగాలు సరఫరా చేస్తుందా? చేయదా? అనే సందేహంలో ఉండాల్సిన అవసరం లేకుండా, దేశీయ ఉత్పత్తి వ్యవస్థ ఉండటం అత్యంత కీలకం. భారత్ వంటి భారీ దేశం కేవలం ఆయుధాల వినియోగదారుగా ఉండటం సరైనది కాదు. విస్తారమైన భూభాగం, దీర్ఘ సరిహద్దులు, సముద్ర రక్షణ అవసరాలు, అంతరిక్ష ప్రయోజనాలు, ఆధునిక సాంకేతిక పోటీ.. ఇవన్నీ ఉన్న దేశం తన రక్షణ సామర్థ్యాన్ని ఇతరుల చేతుల్లో పెట్టడం ప్రమాదకరం. భారత్ ఇప్పుడు క్రమంగా ఆయుధాల కొనుగోలుదారు దేశం నుంచి ఆయుధ తయారీ, ఎగుమతి సామర్థ్యం కలిగిన దేశంగా మారే ప్రయత్నం చేస్తోంది. ఈ మార్పు విజయవంతమైతే రేపు మనకు అవసరమైన రక్షణ సామగ్రిని తయారు చేసుకోవడమే కాకుండా, మిత్రదేశాలకు కూడా ఎగుమతి చేసే అవకాశం పెరుగుతుంది. అంటే నిన్నటి వరకు విదేశీ ఆయుధ కంపెనీలకు భారీ మార్కెట్‌గా ఉన్న భారత్, రేపు అంతర్జాతీయ రక్షణ మార్కెట్‌లో పోటీదారుగా మారే అవకాశం ఉంది. ఇదే అసలు మార్పు. అయితే స్వదేశీ అనే పదం కేవలం రాజకీయ నినాదంగా మారకూడదు. స్వదేశీ ఆయుధం అంటే నాణ్యతలో రాజీ ఉండకూడదు. ప్రపంచ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతికత, నిరంతర పరిశోధన, పారదర్శక పరీక్షలు తప్పనిసరి.

దేశీయంగా తయారైంది కాబట్టి నాసిరకమైన ఉత్పత్తిని కొనుగోలు చేయడం స్వదేశీ కాదు. ప్రపంచంలోని అత్యుత్తమ ఉత్పత్తులతో పోటీపడే నాణ్యతను సృష్టించడమే నిజమైన స్వదేశీ. అందుకే ఇస్రో, డీఆర్డీవో, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు కలిసి పనిచేసే బలమైన వ్యవస్థను నిర్మించాలి. రక్షణ పరిశోధనలో యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, స్టార్టప్‌లకు మరిన్ని అవకాశాలు కల్పించాలి. దిగుమతి చేసుకునే ప్రతి కీలక పరికరం వెనుక ఉన్న సాంకేతికతను అధ్యయనం చేసి, దానికి మెరుగైన దేశీయ ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేయాలి. రక్షణ రంగ స్వదేశీకరణ వల్ల ప్రభుత్వానికి విదేశీ మారకద్రవ్య భారం తగ్గుతుంది. పరిశ్రమలకు భారీ ఆర్డర్లు వస్తాయి. నైపుణ్య ఉపాధి పెరుగుతుంది. పరిశోధన రంగానికి పెట్టుబడులు పెరుగుతాయి. దేశంలో తయారైన సాంకేతికత పౌర రంగాలకు కూడా ఉపయోగపడే అవకాశం ఉంటుంది. రక్షణ రంగం కోసం అభివృద్ధి చేసిన అనేక సాంకేతికతలు తరువాత వైద్యం, అంతరిక్షం, సమాచార వ్యవస్థలు, రవాణా, తయారీ రంగాల్లో ఉపయోగపడిన ఉదాహరణలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. కాబట్టి రక్షణ పరిశోధనపై పెట్టే పెట్టుబడి కేవలం సైన్యానికే పరిమితం కాదు. అది దేశ సాంకేతిక అభివృద్ధికి పెట్టుబడి.

ప్రపంచం మారుతోంది. స్నేహాలు శాశ్వతం కావచ్చు కానీ దేశ ప్రయోజనాలే ప్రతి దేశానికి మొదటి ప్రాధాన్యం. నేడు ఆయుధాలు సరఫరా చేసే దేశం రేపు రాజకీయ కారణాలతో సరఫరాను నిలిపివేయవచ్చు. అందుకే జాతీయ భద్రత విషయంలో స్వావలంబన అత్యవసరం. భారత్ చేపడుతున్న స్వదేశీ రక్షణ ప్రయాణం ఈ వాస్తవాన్ని గుర్తించి వేసిన అడుగు. మన దేశానికి అవసరమైన పరికరాలను మనమే తయారు చేసుకోవడం ద్వారా విదేశీ ఆయుధ మార్కెట్లపై ఆధారపడటం తగ్గుతుంది. విదేశీ కంపెనీలకు వెళ్లే వేల కోట్ల రూపాయల నిధులు దేశంలోనే పరిశ్రమలుగా, పరిశోధనగా, ఉద్యోగాలుగా మారతాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగితే ఆయుధాలు అమ్మి లాభాలు పొందే అంతర్జాతీయ వ్యాపార రాజకీయాలకు భారత్ శాశ్వత పరిష్కారం ఒక్కటే-స్వదేశీ సామర్థ్యం. అందుకే భారత్ లక్ష్యం కేవలం ఎక్కువ ఆయుధాలు కలిగి ఉండటం కాదు. అవసరమైన ఆయుధాలను ఇతరుల అనుమతి లేకుండా, ఇతరుల దయపై ఆధారపడకుండా, తన సాంకేతిక శక్తితో తానే తయారు చేసుకునే స్థాయికి చేరుకోవడం. ఇదే నిజమైన రక్షణ స్వాతంత్ర్యం. ఇదే రేపటి బలమైన భారత్‌కు పునాది. స్వదేశీ ఆయుధం అంటే కేవలం ఒక సైనిక పరికరం కాదు.. అది దేశ ఆర్థిక స్వాభిమానం, సాంకేతిక స్వావలంబన, వ్యూహాత్మక స్వాతంత్ర్యానికి ప్రతీక.



రణధీర్ గుండు, హైదరాబాద్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.